

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 03-12-2025 | సంపుటి - 26 | సంచిక -195 | రూ : 4 | పేజీలు: 8





2లో

# గ్లోబల్ సదస్సు...

## మోదీని ఆహ్వానించనున్న రేవంత్ రెడ్డి, చంద్రబాబుకు కోమటిరెడ్డి ఆహ్వానం

- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆహ్వానం
- ఆహ్వానించే బాధ్యతలు మంత్రులకు అప్పగింత
- ఢిల్లీ ముఖ్యమంత్రిని ఆహ్వానించనున్న ఎంపీల బృందం



2లో

## త్వరలోనే ఆర్టీసీకి

# 1000 ఈవీ బస్సులు

- విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదం
- వినియోగదారుడే విద్యుత్ ఉత్పత్తిదారుగా మారే విధానాలకు ప్రోత్సాహం
- గత ప్రభుత్వ పీపీఏల రద్దుతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం పడిందన్న సీఎం

## కేంద్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు..

# రాజ్ భవన్ పేరు మార్పు

- వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా పేర్లు మార్చాలని కేంద్రం నిర్ణయం
- లోక్ భవన్, లోక్ నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర హోంశాఖ లేఖ
- ఇప్పటికే పేర్లు మార్చిన బెంగాల్, తమిళనాడు, గుజరాత్, కేరళ, అసోం, త్రిపుర, ఒడిశా




2లో



2లో

# 'సేవా తీర్థ్'..

## ప్రధానమంత్రి కార్యాలయం పేరు మారింది!

- ప్రధాని కార్యాలయ నూతన కాంప్లెక్స్‌కు 'సేవా తీర్థ్'గా నామకరణం
- దేశవ్యాప్తంగా రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'గా మారుస్తున్న కేంద్రం
- వలసవాద గుర్తులను తొలగించే ప్రక్రియలో భాగంగా ఈ మార్పులు
- ఇప్పటికే రాజ్‌పథ్‌ను కర్తవ్యపథ్‌గా, పీఎం నివాసాన్ని లోక్‌కల్యాణ్ మార్గ్‌గా మార్పు
- ప్రజలకు సేవ అందించడమే ప్రభుత్వ లక్ష్యమనే సందేశం

## వరంగల్‌కు

# మహర్దశ..

### కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో వేల ఉద్యోగాలు

- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ పనులు వేగవంతం
- పీఎం-మిత్ర పథకం కింద కేంద్రం రూ. 200 కోట్ల కేటాయింపు
- మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబడులతో 12,500 ఉద్యోగాలు



2లో

## పాతబస్తీకి

# కొత్త అందం..



2లో

### చారిత్రక బమ్రుక్‌నుద్దౌలా చెరువుకు పునరుజ్జీవం

- తుది మెరుగులు దిద్దుకుంటున్న బమ్రుక్‌నుద్దౌలా చెరువు
- మరో 15 రోజుల్లో ప్రారంభానికి సిద్ధం
- 18 ఎకరాలకు విస్తరించిన చారిత్రక చెరువు




2లో

మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్.. నిఘా కోసమేనని ప్రతిపక్షాల ఆరోపణ

## కాశీ ఎంపీగా అతని పట్ల గర్విస్తున్నాను: ప్రధాని

వారణాసి, డిసెంబర్ 02 : తొమ్మిదేళ్ల బాలుడు వేదమూర్తి దేవవ్రత మహేష్ రేఖే సాధించిన అద్భుతమైన ఘనతపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కాశీ (వారణాసి) నగరంలో ఈ బాలుడు ప్రదర్శించిన అసాధారణ ప్రతిభను, రాబోయే తరాలు సైతం గుర్తుంచుకుంటాయని ఆయన కొనియాడారు. కాశీ ఎంపీగా అతని ఘనత పట్ల గర్విస్తున్నానని తెలిపారు. దేవవ్రత కేవలం 50 రోజుల వ్యవధిలో, ఎలాంటి ఆటంకాలు లేకుండా శుక్ల యజుర్వేదంలోని మధ్యందిని శాఖకు చెందిన 2000 వేద మంత్రాలను దండక్రమ పారాయణం రూపంలో పూర్తి చేశాడు. ఎన్నో పవిత్ర శ్లోకాలను, పదాలను దోషరహితంగా పఠించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ అద్భుత ప్రతిభపై స్పందించిన ప్రధాని, భారతీయ సంస్కృతిని ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ బాలుడి పట్ల గర్వపడతారని అన్నారు. దేవవ్రత మన గురు పరంపరకు నిలువెత్తు నిదర్శనమని ప్రశంసించారు. "కాశీ ఎంపీగా, ఈ పవిత్ర నగరంలో ఈ అద్భుతం జరగడం నాకు చాలా సంతోషంగా ఉంది. దేవవ్రత కుటుంబ సభ్యులకు, అతనికి మద్దతుగా నిలిచిన సాధువులు, పండితులు, సంస్థలకు నా ప్రణామాలు తెలియజేస్తున్నాను" అని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు. ఈ చిన్న వయసులోనే దేవవ్రత సాధించిన ఘనత దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

## 'సేవా తీర్థ్'... ప్రధానమంత్రి కార్యాలయం పేరు మారింది!

ఢిల్లీ, డిసెంబర్ 02 : దేశంలో వలసవాద గుర్తులను చెరిపేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'లుగా మార్చిన కేంద్రం, తాజాగా ప్రధానమంత్రి కార్యాలయ (పీఎంవో) నూతన కాంప్లెక్స్‌కు కూడా కొత్త పేరును ఖరారు చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఈ భవన సముదాయానికి 'సేవా తీర్థ్' అని నామకరణం చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుసరించే 'ప్రజలే ప్రథమం' అనే విధానానికి, నిస్వార్థ సేవకు ప్రతీకగా ఈ పేరును ఎంపిక చేశారు. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్న ఈ కాంప్లెక్స్‌లో పీఎంవోతో పాటు కేబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఉంటాయి. ప్రపంచ నేతలతో ఉన్నత స్థాయి సమావేశాల కోసం 'ఇండియా హౌస్' కూడా దీనిలో భాగంగా ఉంటుంది. గత కొద్ది రోజులుగా ఉత్తరాఖండ్, కేరళ, త్రిపుర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లోని రాజ్‌భవన్ల పేర్లను 'లోక్ భవన్'గా మార్చిన విషయం తెలిసిందే. ఈ పరంపరలోనే పీఎంవోకు కూడా కొత్త పేరు పెట్టారు. గతంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రధాని నివాసం ఉండే రేస్ కోర్స్ రోడ్డును 'లోక్ కల్యాణ్ మార్గ్'గా, చారిత్రక రాజ్‌పథ్‌ను 'కర్తవ్య పథ్'గా, సెంట్రల్ సెక్రటేరియట్‌ను 'కర్తవ్య భవన్'గా మార్చింది. 'రాజ్' (పాలన) స్థానంలో 'సేవ', 'కర్తవ్యం', 'లోక్' (ప్రజలు) వంటి భావనలకు ప్రాధాన్యమిస్తూ పాలనా కేంద్రాలకు కొత్త పేర్లు పెడుతున్నారు. అధికారం కాకుండా బాధ్యత, సేవకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్న సందేశాన్ని ఈ మార్పుల ద్వారా స్పష్టం చేస్తున్నారు.

### కేంద్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు..
## రాజ్ భవన్ పేరు మార్పు

హైదరాబాద్, డిసెంబర్ 02 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. అన్ని రాజ్‌భవన్‌లను లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది. వలసవాద వాసనలను తుడిచిపెట్టే ఉద్దేశంలో భాగంగా, రాజ్‌భవన్, రాజ్‌నివాస్‌ల పేర్లను లోక్‌భవన్, లోక్‌నివాస్‌లుగా మార్చే అంశాన్ని పరిశీలించాలని గవర్నర్లు, లెఫ్టినెంట్ గవర్నర్లకు సూచిస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ లేఖ రాసింది. అందుకు అనుగుణంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు, గుజరాత్, అసోం, కేరళ, త్రిపుర, ఒడిశా తదితర రాష్ట్రాలు ఉత్తర్వులు జారీ చేశాయి.

### మొబైల్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్..
## నిఘా కోసమేనని ప్రతిపక్షాల ఆరోపణ

ఢిల్లీ, డిసెంబర్ 02 : భారతదేశంలో తయారైనదైనా లేక విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నదైనా సరే.. దేశంలోని ప్రతీ మొబైల్ ఫోన్ లోను సంచార్ సాథీ యాప్ ను తప్పనిసరిగా ఇన్ స్టాల్ చేయాలని కేంద్ర ప్రభుత్వం మొబైల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. తొలగించడానికి వీలులేకుండా ఇన్ స్టాల్ చేయాలని సూచించింది. దీని కోసం ప్రభుత్వం 90 రోజులు గడువు కూడా విధించింది. మొబైల్ వినియోగదారులను సైబర్ మోసాల బారి నుంచి రక్షించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. అయితే, కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు ప్రభుత్వ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ప్రజలపై నిఘా పెట్టేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని, ఇది భారత రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత గోప్యత హక్కుకు భంగం కలిగిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్రం వివరణ..

ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోయాయని, మోసగాళ్లు ఫిషింగ్ మెయిల్స్, మెసేజులు, ఏపీకే ఫైల్స్ పంపిస్తూ అమాయకుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. వాట్సాప్, మెసేజ్, ఫోన్ కాల్స్.. ద్వారా మోసాలకు పాల్పడుతున్నారని వివరించాయి. స్పామ్ కాల్స్, మెసేజ్ లతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నాయి. ఈ మోసాలను అరికట్టేందుకే సంచార్ సాథీ యాప్ ను తీసుకువచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది. మొబైల్ ఫోన్లలో డీఫాల్ట్ గా ఈ యాప్ ను ఇన్ స్టాల్ చేయడం ద్వారా సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు వీలుకలుగుతుందని పేర్కొంది. ఇందుకోసమే సంచార్ సాథీ యాప్‌ను ఇన్ స్టాల్ చేయాలని మొబైల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసినట్లు వివరించింది. కాగా, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలపై మొబైల్ తయారీ కంపెనీలు ఇంకా స్పందించలేదు.

## ఇమ్రాన్ ఖాన్ సురక్షితమే... కానీ..!

: ఉజ్మా ఖానుమ్

పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ మృతిచెందారంటూ వచ్చిన వదంతులకు ఎట్టకేలకు తెరపడింది. ఆయన జైల్లో సురక్షితంగానే ఉన్నారని సోదరి ఉజ్మా ఖానుమ్ తెలిపారు. అయితే, మానసికంగా వేధిస్తున్నట్లు ఆరోపించారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగిన విషయం తెలిసిందే. దీంతో ఉజ్మాతో పాటు ఓ లాయర్ ఆయన్ని కలిసేందుకు జైలు అధికారులు మంగళవారం అనుమతించారు. కొన్నిరోజులుగా ఇమ్రాన్ మరణించారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వదంతులు వ్యాపించిన విషయం తెలిసిందే. వీటన్నింటినీ అక్కడి ప్రభుత్వం ఖండించింది. అయినప్పటికీ.. ఆయన్ని చూపించాలని, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు వెల్లడించాలని మద్దతుదారులు డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతించాలని కుటుంబ సభ్యులు కోరారు. అందుకు జైలు అధికారులు మంగళవారం వరకూ నిరాకరిస్తూ వచ్చారు. దీంతో ఇమ్రాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇమ్రాన్‌ను కలిసేందుకు అధికారులు అనుమతించారు.

### పాతబస్తీకి కొత్త అందం..
## చారిత్రక బమ్మక్‌నుద్దౌలా చెరువుకు పునరుజ్జీవం

హైదరాబాద్, డిసెంబర్ 02 : పాతబస్తీకి మణిహారంగా నిలిచే చారిత్రక బమ్రుక్‌నుద్దౌలా చెరువు పునరుద్ధరణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మరో 15 రోజుల్లో ఈ చెరువును ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆక్రమణల కారణంగా ఆనవాళ్లు కోల్పోయిన ఈ చెరువు, హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ పనులతో పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం చెరువు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు చుట్టూ నిర్మిస్తున్న బండ్, ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను ఆయన తనిఖీ చేశారు. చెరువుకు మూడు వైపులా నిర్మిస్తున్న ప్రవేశ మార్గాలను పరిశీలించి, స్థానికులు సులభంగా లోపలికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చెరువు చుట్టూ ఔషధ మొక్కలు, నీడనిచ్చే చెట్లను నాటాలని ఆదేశించారు. ప్రజలు కూర్చునేందుకు వీలుగా నిర్మిస్తున్న గుమ్మటాలు (గజబోలు), ప్రవేశ ద్వారాలు ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని కోరారు. వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, పిల్లల కోసం ప్లే ఏరియాలు, వృద్ధులకు సీటింగ్ జోన్లు, ఓపెన్ జిమ్‌లు, పార్కులను త్వరగా పూర్తి చేయాలన్నారు. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి, హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఆక్రమణలకు గురై కేవలం 4.12 ఎకరాలకే పరిమితమైన ఈ చెరువును, హైడ్రా చొరవతో పూర్తిస్థాయిలో 18 ఎకరాలకు విస్తరించినట్లు రంగనాథ్ తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఆక్రమణలు తొలగించామని, ఈ చెరువు అభివృద్ధి ద్వారా వరద కట్టడితో పాటు భూగర్భ జలాలు కూడా వృద్ధి చెందుతాయని వివరించారు. 1770లో నిజాం ప్రధాని నవాబ్ రుక్నుఉద్‌దౌలా నిర్మించిన ఈ చెరువుకు ఘనమైన చరిత్ర ఉంది. ఒకప్పుడు ఈ చెరువులోని నీటిని సుగంధ ద్రవ్యాల తయారీకి వాడేవారని, ఔషధ గుణాలుండేవని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాతబస్తీకి ఈ అభివృద్ధి ఎంతో అవసరమని, రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## త్వరలోనే ఆర్టీసీకి 1000 ఈవీ బస్సులు

అమరావతి, డిసెంబర్ 02 : రాష్ట్రంలో పర్యావరణ హితమైన రవాణాను ప్రోత్సహించేందుకు ఆర్టీసీకి త్వరలోనే వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాబోయే ఐదేళ్లలో ఆర్టీసీ బస్సులన్నింటినీ ఈవీలుగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. దీనికి అనుబంధంగా రాష్ట్రవ్యాప్తంగా 5 వేల ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మంగళవారం నాడు సచివాలయంలో విద్యుత్ శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వంపై సుమారు రూ.1,053 కోట్ల భారం పడనుంది. రాష్ట్ర పారిశ్రామిక రంగంలో కీలకమైన ఈ పరిశ్రమలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల (పీఎస్పీ) ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని, ఇందుకు జెన్‌కో, జలవనరుల శాఖ అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేయాలని ఆదేశించారు.

**60 రోజుల్లోనే పనులు ప్రారంభం కావాలి**

రాష్ట్రాన్ని ఒక 'న్యూ ఎనర్జీ హబ్'గా మార్చాలని ఆకాంక్షించిన చంద్రబాబు, ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐస్) పాలసీ కింద ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలు 60 రోజుల్లోనే తమ పనులను ప్రారంభించేలా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో 'పవర్ స్వాపింగ్' ఒప్పందాలు చేసుకోవాలని సూచించారు.

*** గత ప్రభుత్వ నిర్ణయాలతో రూ.9 వేల కోట్ల భారం**

గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని చంద్రబాబు విమర్శించారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాల (పీపీఏ) రద్దు నిర్ణయంతో ప్రజలపై రూ.9 వేల కోట్ల భారం పడిందని, విద్యుత్‌ను వినియోగించుకోకుండానే కంపెనీలకు ఆ ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, సమర్థ నిర్వహణ ద్వారా విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే ఆ భారాన్ని సున్నాకు తగ్గించగలిగామని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ కె.విజయానంద్, ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల సీఎండీలు పాల్గొన్నారు.

## వరంగల్‌కు మహర్దశ.. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్‌తో వేల ఉద్యోగాలు

వరంగల్, డిసెంబర్ 02 : హైదరాబాద్ తర్వాత తెలంగాణలో రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రతిష్ఠాత్మక కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు, ముఖ్యంగా మహిళలకు భారీగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పీఎంమిత్ర పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపికైన 7 మెగా టెక్స్‌టైల్ పార్కులలో వరంగల్‌లోని కాకతీయ పార్క్ ఒకటి. ఈ ప్రాజెక్టు పురోగతిపై సమీక్ష నిర్వహించిన కిషన్ రెడ్డి, మొత్తం రూ. 200 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తొలి విడతగా రూ. 30 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ. 30 కోట్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతపల్లి గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు. భూసేకరణ ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లు మంత్రి తెలిపారు. ఈ పార్కు ద్వారా మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబడులు వస్తాయని, తద్వారా 12,500 మందికి పైగా స్థానికులకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందని అంచనా. ఇప్పటికే దక్షిణ కొరియాకు చెందిన ఎవర్ టాప్ టెక్స్ అనే సంస్థ రూ. 1,100 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒక్క కంపెనీతోనే 12 వేల ఉద్యోగాలు రానున్నాయి. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (TSIIC) పర్యవేక్షణలో రోడ్లు, విద్యుత్, నీటి సరఫరా వంటి అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారు. యంగ్ వన్ కార్పొరేషన్ అనే మరో సంస్థ ఇప్పటికే తన యూనిట్‌ను ఏర్పాటు చేసి, 2025 అక్టోబర్ నుంచి వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించనుంది. త్వరలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించి పార్కుకు భూమిపూజ చేయించాలని భావిస్తున్నట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఓరుగల్లు ఆర్థిక స్వరూపమే మారిపోతుందని అంచనా వేస్తున్నారు.

## గ్లోబల్ సదస్సు... మోదీని ఆహ్వానించనున్న రేవంత్ రెడ్డి, చంద్రబాబుకు కోమటిరెడ్డి ఆహ్వానం

హైదరాబాద్, డిసెంబర్ 02 : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించే బాధ్యతను మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి అప్పగించారు. సదస్సుకు ప్రధానమంత్రి సహా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఢిల్లీ వెళుతున్న రేవంత్ రెడ్డి రేపు ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీతో భేటీ కానున్నారు. తెలంగాణ రైజింగ్ 2025 సదస్సుకు ఆహ్వానం పలకనున్నారు. అనంతరం పలువురు కేంద్రమంత్రులను కలిసి వారిని కూడా ఆహ్వానించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులను ఆహ్వానించే బాధ్యతలను మంత్రులకు అప్పగించారు. రాష్ట్ర ఎంపీల బృందం ఢిల్లీ ముఖ్యమంత్రి, కేంద్రమంత్రులు, గవర్నర్లను ఆహ్వానించనుంది.

**మంత్రులకు ఆహ్వాన బాధ్యతలు**

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్), ఉత్తమ్ కుమార్ రెడ్డి (జమ్ము కశ్మీర్, గుజరాత్), దామోదర రాజనర్సింహ (పంజాబ్, హర్యానా), శ్రీధర్ బాబు (కర్ణాటక, తమిళనాడు), పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి (ఉత్తరప్రదేశ్), పొన్నం ప్రభాకర్ (రాజస్థాన్), కొండా సురేఖ (ఛత్తీస్‌గఢ్), సీతక్క (పశ్చిమ బెంగాల్), తుమ్మల నాగేశ్వరరావు (మధ్యప్రదేశ్), జూపల్లి కృష్ణారావు (అసోం), జి. వివేక్ (బీహార్), శ్రీహరి (ఒడిశా), అడ్లూరి లక్ష్మణ్ (హిమాచల్ ప్రదేశ్), అజారుద్దీన్ (మహారాష్ట్ర) ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించనున్నారు.

## పాక్ దుర్బుద్ధి.. శ్రీలంకకు 'ఎక్స్‌పైరీ' సాయం?

దిత్వా తుపాను ప్రభావంతో వణుకుతున్న శ్రీలంకకు భారత్ సహా పలు దేశాలు సాయం అందిస్తున్నాయి. ఈ క్రమంలో పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి.. వారికి గడువు ముగిసిన వస్తువులను సాయంగా పంపించిందనే వార్తలు వస్తున్నాయి. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. తుపాను ప్రభావంతో అల్లాడుతున్న శ్రీలంకకు సాయంగా ఆహారం, ఔషధాలను పాకిస్థాన్ పంపించింది. ఇవి కొలంబోకు చేరుకున్న విషయాన్ని తెలియజేస్తూ.. "శ్రీలంకకు పాకిస్థాన్ ఇప్పుడు, ఎప్పుడూ అండగా ఉంటుంది" అని ముద్రించిన ప్యాకెట్లను శ్రీలంకలోని పాకిస్థాన్ హైకమిషన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. అయితే, ప్యాకెట్లపై గడువు తేదీ 2024 అక్టోబర్‌లోనే ముగిసినట్లు తెలిసింది. వీటిని గమనించిన శ్రీలంక అధికారులు.. ఈ విషయాన్ని పాక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతోపాటు తమ అసంతృప్తిని తెలియజేసినట్లు సమాచారం. పాకిస్థాన్ గతంలోనూ ఇలాంటి విమర్శలే ఎదుర్కొంది. 2015లో నేపాల్ భూకంపం ఘటన సమయంలోనూ కొన్ని ఆహార పదార్థాలు పంపించి వివాదానికి కారణమైంది. తాజా పరిణామాలపై పాకిస్థాన్ నుంచి ఎటువంటి స్పందన రాలేదు.



**భారత్ ఆపన్నహస్తం..**

ఆపదలో ఉన్న పొరుగు దేశాన్ని ఆదుకునేందుకు భారత్ భారీ ఆపరేషన్ చేపట్టింది. 'ఆపరేషన్ సాగర్ బంధు' పేరుతో 53 టన్నుల అత్యవసర వస్తువులను ప్రత్యేక విమానాల్లో పంపించింది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతోనూ సహాయక చర్యలు చేపట్టింది. వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. మారుమూల ప్రాంతాల్లో వరదల్లో చిక్కుకుపోయిన అనేక మంది శ్రీలంక వాసులను ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కాపాడినట్లు భారత విదేశాంగ వెల్లడించింది. శ్రీలంకలో వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలో దాదాపు 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 352 మంది గల్లంతయ్యారు. సుమారు 3లక్షల మంది చిన్నారులపై ఈ తుపాను తీవ్ర ప్రభావం చూపినట్లు యునిసెఫ్ పేర్కొంది.

# మహిళల భద్రతకు షీ టీం భరోసా

* మహిళలను వేధింపులకు గురి చేసే ఆకతాయిల భరతం పడతాం
* మహిళ భద్రతపై విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
* సోషల్ మీడియాలో అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జిల్లా షీ టీం




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: మహిళల భద్రతకు షీ టీం భరోసా కల్పిస్తుందని జిల్లా షీ టీం ఒక ప్రకటనలో పేర్కొంది. మహిళలను, విద్యార్థినీలను వేధింపులకు గురి చేసే ఆకతాయిల భరతం పడతామని హెచ్చరించింది. జిల్లా షీ టీమ్ ప్రతిరోజూ విద్యాసంస్థలు, మహిళలు పని చేసే ప్రదేశాలను సందర్శిస్తూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో చట్టం, షీ టీమ్ సేవలు, మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపింది. గత నెలలో జిల్లాలో వేధింపులకు పాల్పడిన వారిపై 2ఎఫ్ఐఆర్, 02 పెట్టి కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందని పేర్కొంది. ఇందులో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను షీ టీమ్ బృందం మంగళవారం సందర్శించి, విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఎవరైనా వేధింపులకు గురైతే నిర్భయంగా షీ టీమ్ నెంబర్ 87126 56425కు ఫిర్యాదు చేయాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అధికారులు సూచించింది. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులకు స్పందించకూడదని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవొద్దని తెలిపింది. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఏఎస్ఐ ప్రమీల, వీరయ్య, సిబ్బంది శ్రీలత, ప్రియాంక, శ్రీనివాస్‌తో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ప్రపంచస్థాయికి

: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దివంగత ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఏర్పాటు చేస్తున్న ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయికి తీసుకువెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన యూనివర్సిటీ భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా పూర్తిస్థాయి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని తెలంగాణలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. యూనివర్సిటీ భవనాలు, ల్యాబ్‌లు, పరిశోధనా కేంద్రాలు, ఇతర మౌలిక వసతులను అత్యాధునికంగా, వేగంగా పూర్తి చేసి విద్యార్థులకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. భూమి, భూమి లోపలి పొరలు, ఖనిజ వనరులు, భూగర్భ జలాలు, వాతావరణ మార్పులు వంటి అంశాలపై ఇక్కడ విస్తృత పరిశోధనలు జరుగుతాయని చెప్పారు.ఈ యూనివర్సిటీ రాష్ట్రానికే కాకుండా దేశానికే ఓ గర్వకారణంగా నిలుస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించడం చారిత్రాత్మక ఘట్టమని భట్టి విక్రమార్క అన్నారు. అత్యున్నత విద్యా, పరిశోధనా కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దడం ద్వారా తెలంగాణ దేశానికి దిక్సూచిగా మారుతుందని తెలిపారు.

## ఇల్లందు జేకే పై ఓసీలో గుండెపోటుతో కార్మికుడి మృతి



ప్రజా స్ఫూర్తి, ఇల్లందు : సింగరేణి ఇల్లందు ఏరియా జేకే పై ఓసీలో విధులు నిర్వహిస్తుండగానే గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్ళితే.... సింగరేణి జేకె పై ఓసీలో జనరల్ మజ్దూర్ గా విధులు నిర్వహిస్తున్న పాల్వాయి శ్రీనివాసులు (59) ఎప్పటిలాగే మంగళవారం డ్యూటీకి వెళ్ళాడు. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు హుటాహుటిన సింగరేణి వైద్యశాలకు తరలించారు. పరిశీలించిన వైద్యులు శ్రీనివాసులు మరణించినట్లుగా ధ్రువీకరించారు. అయితే శ్రీనివాసులుకు గుండె నొప్పి రావడంతో 2011లో స్టంట్ వేశారు. మెడికల్ బోర్డు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. శ్రీనివాసులు మృతి పట్ల గుర్తింపు సంఘం నాయకులు కె సారయ్య, ఎండీ నజీర్ అహ్మద్, శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జే వెంకటేశ్వర్లు, గోచికొండ సత్యనారాయణ, కొండూరు చిన్న, బండి రాము, బాబురావు, టీబీజీకేఎస్ నాయకుడు జాఫర్ హుస్సేన్ లు మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్మికుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## ఏ మతానికి అడ్డు రాని ఆంక్షలు, హిందూ మతానికే అడ్డొస్తాయా

* రవికుమార్ గురు స్వామి



మల్కాజిగిరి,ప్రజాస్ఫూర్తి : మొన్న అయ్యప్ప మాల ధరించిన కాంఛన్ బాగ్ పిఎస్ ఎస్సై కృష్ణ కాంత్ కు ఆంక్షలు విధిస్తూ ఉన్నతాధికారులు అతనికి మెమో జారీ చేసిన ఘటన మరవక ముందే,మల్కాజిగిరి నియోజకవర్గం,వినాయక్ నగర్ డివిజన్ చంద్రగిరి కాలనీ నలంద స్కూల్లో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి అయ్యప్ప మాల ధరించాడని అవమానించి ఆంక్షలు విధించిన స్కూల్ నిర్వాహకులు తీరు బాధాకరమని గురు స్వామి రవికుమార్ అన్నారు. మంగళవారం గురుస్వామి రవికుమార్ నేతృత్వంలో మల్కాజిగిరిలో మాల ధరించిన గురుస్వాములు, స్వామి మాలధారుల అందరూ కలిసి నలంద స్కూల్ లో నిరసన తెలుపుతూ ప్రిన్సిపల్ ను సదరు విషయంపై నిలదీయడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటామని ప్రిన్సిపల్ హామీ ఇవ్వడంతో అయ్యప్ప స్వామి మాలాదారులు నిరసన విరమించారు.ఈ సందర్భంగా గురు స్వామి రవికుమార్ గురు స్వామి మాట్లాడుతూ సమాజంలో హిందూ మతం అంటే అందరికీ చిన్న చూపే,కుల మతాలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించే అయ్యప్ప మండల దీక్ష అడుగడుగునా ఉద్యోగులకు, విద్యార్థులకు ఆంక్షలు విధిస్తూ అడ్డుపడడం సరికాదని అని అన్నారు.ఇటీవల సినీ దర్శకుడు రాజమౌళి హిందూ దేవుళ్ళపై చేసిన వ్యాఖ్యలను కూడా ఈ సందర్భంగా ఖండించారు.కార్యక్రమంలో గురుస్వాములు నాగరాజు,శ్రవణ్ యాదవ్,బాలకృష్ణ,నాని గౌడ్ సురేష్,ఉంగరాల శ్రీనివాస్,నరేష్ , పెద్ద ఎత్తున స్వాములు పాల్గొన్నారు.



## మాజీ సీఎం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జయంతి, వర్ధంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలి

వికారాబాద్, (ప్రజాస్ఫూర్తి): మాజీ ముఖ్యమంత్రి, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఇకపై రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని వికారాబాద్ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు సంకేపల్లి మోహన్ రెడ్డి కోరారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంకేపల్లి మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా సేవలు అందించిన చెన్నారెడ్డి సేవలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. వారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.అనంతరం స్థానిక రెడ్డి సంఘం కార్యాలయంలో చెన్నారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిన గొప్ప దార్శనికుడు మర్రి చెన్నారెడ్డి అని కొనియాడారు. ఆయన జీవితం, రాజకీయ ప్రస్థానం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు కమల్ రెడ్డి, అనంత రెడ్డి, రామ్ రెడ్డి, మోహన్ రెడ్డి, నరోత్తం రెడ్డి, మద్ది బిచ్చి రెడ్డి, మహేందర్ రెడ్డి, రెడ్డి రాఘవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు ఇమంది ఉదయ్ కుమార్ అక్రమ అరెస్టు




* అరెస్టును ఖండించిన జర్నలిస్టులు...

భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాస్ఫూర్తి : కొత్తగూడెం నియోజకవర్గంలో మంగళవారం సీఎం పర్యటన సందర్భంగా మంగళవారం ఉదయం టీయూడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ ను కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.. దీంతో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు అక్రమ అరెస్టులపై నిరసన తెలిపేందుకు జర్నలిస్టులు పోలీస్ స్టేషన్కు తరలివచ్చారు. టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇండ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు, ఇందిరమ్మ ఇండ్లు హెల్త్ కార్డులు కోసం గతంలో సీఎం చంద్రుగొండ మండలం బెండలపాడు గ్రామానికి వచ్చిన సందర్భంలో నిరసన తెలిపారు. ఈనేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి కొత్తగూడెం మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న క్రమంలో ఉదయ్ కుమార్ ను ముందస్తు అరెస్టు చేశారు.. ఈ అక్రమ అరెస్టులకు నిరసనగా జర్నలిస్టులు, జర్నలిస్ట్ సంఘాలు మద్దతు తెలిపాయి. దీంతో దిగివచ్చిన పోలీసులు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో టీయూడబ్ల్యూజే ఐజేయు భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం టి యు డబ్ల్యూ జే ఐ జేయు నిరంతరం పోరాటం చేస్తుందని ఎట్టి పరిస్థితుల్లో వెనక్కు తగ్గదని అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈశ్వర్, ఏర్పుల సుధాకర్, లక్ష్మణ్, సైదులు, కోలా కుమార్, సత్యనారాయణ, కొండా జంపన్న, కిరణ్ కుమార్, చదలవాడ సూరి మురళి కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది

* ఎమ్మెల్యే కనకయ్య.



ప్రజా స్ఫూర్తి , ఇల్లందు: ఇల్లందు మండలం సుభాష్ నగర్ గ్రామ పంచాయితి మాజీ సర్పంచ్ వల్లాల మంగమ్మ కాంగ్రెస్ పార్టీ పేదలందరికి అందించే సంక్షేమ పథకాలు,చేసే అభివృద్ధి పట్ల అకర్షితులు అవ్వగా సుభాష్ నగర్ గ్రామ పరిధిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో స్థానిక నాయకత్వం అధ్వర్యంలో ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాధరంగా పార్టీలోనికి అహ్వానించారు. వారి వెంట ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్,ఇల్లందు మండలం,టౌన్ అధ్యక్షులు పులి సైదులు,దొడ్డా డానియల్,నాయకులు చిట్టిబాబు, నర్సింహరావు, ఆళ్ళ నాగేశ్వరావు, రామ చంద్రు, ధనుంజయ్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు ఈసం లక్ష్మణ్,ప్రసన్న కుమార్,బండి ఆనంద్,గుమ్మడి అపర్ణ,టౌన్ నాయకులు ఎండీ జాఫర్,సుదర్శన్ కోరి మడుగు సాంబమూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాస్,స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1861 అమలులోకి పోలీస్ యాక్ట్

- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలులోకి వచ్చిందని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజులు డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డిజేలు వినియోగించరాదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




యాదగిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కి పార్టీ అధిష్టానం నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లోని గాంధీ భవన్ లో మంగళవారం జరిగిన టీపీసీసీ కార్యకనిర్వహక సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా నియమకమైన డీసీసీ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. అదేవిధంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎలక్షన్స్ పై చర్చించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నటరాజన్ మీనాక్షి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని , స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు, కష్టపడి పని చేసి ఫలితం ఆశించకుండా ఉంటేనే తగిన గుర్తింపు వస్తుందని నూతనంగా ఎన్నికైన డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. అణగారిన వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పాటుపడుతున్నారని తెలిపారు.

## పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, నిరసనలు నిర్వహించరాదు




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిధిలో పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ తెలిపారు. జిల్లా ఎస్పీ మహేష్ బి గితే రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు చేశారని తెలిపారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజులు డిసెంబర్ 1వ తేది నుండి 31 వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులోకి తెచ్చారని వెల్లడిచారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ డిజేలు వినియోగించరాదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించేలా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

# పెంచికల్ పహాడ్ సర్పంచ్ అభ్యర్థి పన్నాల మల్లికార్జున రెడ్డి పానల్ వార్డ్ మెంబెర్ ఏకగ్రీవం



యాదాద్రి భువనగిరి, ప్రజాస్ఫూర్తి: మంగళవారం భువనగిరి మండలం పెంచికల్ పహాడ్ 6వార్డ్ సభ్యులు సిలివేరు భార్గవి శ్రీను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మల్లికార్జున పానల్ లో ఏకగ్రీవం గా ఎన్నోకున్నారు ఈ సందర్భంగా వారు వార్డ్ ప్రజలు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు ఈ కార్యక్రమం సిలివేరు నర్సింగ్ రావు, హిరకర్ శ్రీను, అచ్చిరెడ్డి నర్సింలు, వార్డ్ ఓటర్లు ప్రజలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గున్నారు

# బాలల ను అన్ని కోణాలలో కాపాడాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యాలదే

* **తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఛైర్మన్ సీత దయాకర్**




మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : బాలల ను అన్ని కోణాలలో కాపాడాల్సిన బాధ్యత కూడా పాఠశాల యాజమాన్యాలదే అని తెలంగాణ రాష్ట బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ఛైర్మన్ సీత దయాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల జరిగిన చిన్నారిపై ఆయమ్మ చేయి చేసుకున్నటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను ప్రైవేట్ స్కూల్స్ లో ఉపాధ్యాయులకు అవగాహన, కౌన్సిలింగ్స్, సేఫ్టీ మెజర్స్, పిల్లలకి కౌన్సలర్స్, సిసి కెమెరాలు, వెహికిల్స్ మెజర్స్, పొక్సొ చట్టం పై అవగాహన వంటి అంశాల పై పైలెట్ ప్రాజెక్టుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాను ఎంపిక చేసుకొని బాలలరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారా లేదా అని పర్యవేక్షిస్తామని ఛైర్మన్ సీత దయాకర్ అన్నారు. పిల్లల భద్రతకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, పాఠశాలలో వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని అన్నారు. మన ఇంట్లో పిల్లల పట్ల ఎంత బాధ్యతగా ఉంటామో అంతే బాధ్యత వారిపట్ల ఉండాలన్నారు. సంఘటనలు జరిగిన తరువాత తీసుకునే చర్యలకంటే, ముందుగా తీసుకునే నివారణ చర్యలు ముఖ్యమన్నారు. ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా పాఠశాల యాజమాన్యాలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పిల్లలకు శారీరక శ్రమ అవసరమని అందుకు గ్రౌండ్స్ లో ఆడుకోవాలని తద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు. పిల్లలకు సంబంధించిన చట్టాల పట్ల పాఠశాలలోని సిబ్బంది అందరికి అవగాహాన కల్పించడమే కాకుండా చట్టాలు అమలు పరచాలని సూచించారు. ప్రతి పాఠశాలలో కమిటిలను ఏర్పాటు చేసుకొని ప్రతి నెల సమావేశమై సమస్యలను చర్చించి సమస్యలను అధిగమించేలా చూడాలన్నారు. పిల్లల పరిరక్షణ చాలా ముఖ్యమని చిన్న చిన్న నిర్లక్షాలతో పెద్ద సమస్యలు ఉత్పన్నమవుతాయని, ఎలాంటి నిర్లక్ష్యాలకు తావు లేకుండా పూర్తి బాధ్యత స్కూల్ యాజమాన్యాలు తీసుకోవాలన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని కాపాడాలన్నారు. పిల్లలకు తల్లిదండ్రులతో పాటు టీచర్లే ముఖ్యమని, వారి భవిష్యత్తుకు టీచర్లే బాధ్యులన్నారు. తెలంగాణకు ఉత్తమ పౌరులను అందించే బాధ్యత టీచర్లదేనని, అందరి విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఒకరు, ఇద్దరి పట్ల నిర్లక్ష్యం వహించిన అది సరికాదన్నారు. పాఠశాలయాజమాన్యాలు తెలిపిన సమస్యలను తాము పరిశీలిస్తామని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, జిల్లా ఇంటర్మిడియెట్ అధికారి కిషన్, ప్రైవేట్ పాఠశాలలయాజమాన్యాలు , తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి కాలం ఫ్రాన్సీ మరణం పట్ల ఎమ్మెల్యే కనకయ్య తీవ్ర దిగ్భ్రాంతి

* **చిన్నారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శ.**



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు: ఇల్లందు మండలం మామిడి గూడెం గ్రామ పంచాయితీ కి చెందిన చిన్నారి కాలం ఫ్రాన్సీ అకాల మరణం చెందడంతో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రి నందు చిన్నారి పార్థివ దేహన్ని ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య సందర్శించి,కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి ఛైర్మెన్ బానోత్ రాంబాబు, ఆముదాల ప్రసాద్,స్థానిక గ్రామస్థలు ఉన్నారు.





# సీఎం సభలో ఆకట్టుకున్న చిన్నారి నైనిక రజువా

* **పర్యావరణ పరిరక్షణకు పిలుపు**
* **ప్రజాప్రతినిధుల నుంచి ప్రశంసలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఆక్సిజన్ కోసం మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని పేర్కొంటూ చిన్నారి నైనిక రజువా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం సభలో గట్టిగా చాటింది. పాల్వంచలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సందర్భంగా సింగరేణియన్, ప్రకృతి హరితదీక్ష వ్యవస్థాపకులు, మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీచే ప్రశంసలందుకున్న కె.ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రకృతి హరితదీక్ష చేపట్టిన కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ''ఈరోజు మొక్కలు నాటకపోతేం రేపు మొక్కలను వీపున మోయాల్సిన పరిస్థితి వస్తుంది'' అంటూ ప్రజలకు అవగాహన కల్పించింది. ఒక చేతిలో ప్లకార్డు, భుజాలపై మొక్కతో నిలుచుని.. ప్రతి ఒక్కరూ ''అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని'', పుట్టిన రోజులు, పెళ్లిళ్లు వంటి శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సందేశం ఇచ్చింది. నైనిక ప్రదర్శన సీఎం సహా సభకు హాజరైన అందరినీ ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు, ప్రజలు ఆమెతో ఫోటోలు దిగుతూ అభినందనలు తెలిపారు. చిన్న వయసులోనే పెద్ద సందేశం ఇచ్చిన నైనికకు సభలో ప్రత్యేక ప్రశంసలు దక్కాయి. ఈ సభలో సీఎం రేవంత్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మట్టా రాగమయి దయానంద్, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పూజా విధానాన్ని వివరించే మార్గదర్శని అయ్యప్ప పుస్తకం...

- **స్వాములకు అయ్యప్ప పూజా విధాన పుస్తకాల పంపిణీ...**



అందోలు, ప్రజాస్ఫూర్తి:అయ్యప్ప స్వామి పూజా విధానం పై అచ్చు వేయించిన పుస్తకాలను మంగళవారం జోగిపేట హౌసింగ్ బోర్డ్ లోని అయ్యప్ప దేవాలయంలో గురు స్వామి దేవరశెట్టి సంతోష్, అయ్యప్ప సేవ సమితి సలహా దారుడు ఆకుల చిట్టిబాబులు పంపిణీ చేశారు. బిక్షకు హాజరైన అయ్యప్ప స్వాములందరికి పుస్తకాలను పంపిణీ చేశారు. పవిత్రమైన మనిషి జన్మను భగవంతుడు ప్రసాదించినప్పుడు ఆ అవకాశాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీతి, నిజాయతీ, కట్టుబాట్లు పాటిస్తూ మనిషి కనీస ధర్మాలను ఆచరించాలన్నారు. నిత్యం భగవన్నామ స్మరణ చేస్తూ సృష్టి, స్థితి, లయ కారకుణ్ని ఆరాధించాలన్నారు. మాధవ సేవతోపాటు మానవ సేవతో మోక్షాన్ని పొందాలి. అలాంటి అత్యుత్తమమైన మార్గాన్ని అనుసరింపజేసే ఆధ్యాత్మక భావన అయ్యప్ప మాల అని అయ్యప్ప కథ ప్రగాఢమైన భక్తి, ధైర్యం మరియు ఆధ్యాత్మిక క్రమశిక్షణతో కూడినది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులను ధర్మం మరియు స్వీయ నియంత్రణ మార్గంలో నడవడానికి ప్రేరేపించింది అయ్యప్ప చరిత్ర. ఆ హరిహరపుత్రుడి జీవిత చరిత్రను, ఆయన పూజా విధానాన్ని వివరించే పుస్తకమే ఈ హరిహరామృతం. అయ్యప్ప భగవానుడి మనోహరమైన జీవితాన్ని మాత్రమే కాకుండా, ఏటా అసంఖ్యాకులైన అయ్యప్ప మాల ధారణ చేసే స్వాములకు ఆ హరిహరపుత్రుడి పూజా విధానాన్ని, చేయాల్సిన, చేయకూడని పనులను వివరించే మార్గదర్శని ఈ పుస్తకమన్నారు.

# ఎట్టకేలకు మోడల్ స్కూల్ టీచర్లకు న్యాయం




గత 12 సంవత్సరాలుగా నోషనల్ సీనియారిటీ కోసం ఎదురుచూస్తున్న మోడల్ స్కూల్ టీచర్లకు ఊరట లభించింది. రాష్ట్రంలోని 1326 మంది మోడల్ స్కూల్ టీచర్లకు లబ్ధి చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2014 సెప్టెంబర్లో నియామకమైన మోడల్ స్కూల్ టీచర్లకు 2013 జూన్ లో అపాయింటైన టీచర్లతో సమానంగా మూలవేతనం, సీనియారిటీ కల్పించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలకు అనుగుణంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకే నోటిఫికేషన్లో ఎంపికైన టీచర్ల వేతనాల్లో వ్యత్యాసం ఉండడం సమంజనం కాదని పేర్కొంది. 2013 ఫస్ట్ ఫేజ్లో ఎంపికైన టీచర్లతో సమానంగా తమకు కూడా వేతనం ఇవ్వాలని, సీనియారిటీ కల్పించాలని సెప్టెంబర్ 2014లో విధుల్లో చేరిన టీచర్లు హైకోర్టుని ఆశ్రయించారు. అయితే ఆ కేసులో హైకోర్టు టీచర్లకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ నిర్ణయంతో 2014 సెప్టెంబర్లో నియామకమైన టీచర్లకు 2013 జూన్ నుంచి రెగ్యులర్ స్కేల్ మంజూరు చేయనున్నారు. తాజా నిర్ణయంతో 2013 పీఆర్సీకి సైతం అర్హత వచ్చినట్లయిందని పలువురు టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కొక్క టీచర్ కు మూడు, నాలుగు ఇంక్రిమెంట్ల వేతన లబ్ది చేకూరనుంది. 2013 జూన్ నుంచి ఎరియర్స్ నోషనల్ గా వర్తింపజేసి, ఏప్రిల్ లేదా జులై 2025 నుంచి నగదు ప్రయోజనాలు లభించనున్నాయి. 2013 జూన్ నుంచే సీనియారిటీ లెక్కిస్తారు. ఈ నిర్ణయంతో 768 మంది పీజీటీలు, 568 మంది కలిపి మొత్తం 1326 మంది లబ్ధిపొందనున్నారు.



# పిట్లం అభివృద్ధే నా లక్ష్యం

: **నవాబ్ సుదర్శన్ గౌడ్**

* **పిట్లం సర్పంచ్ అభ్యర్థి నవాబ్ సుదర్శన్ గౌడ్ నామినేషన్ దాఖలు**

(ప్రజాస్ఫూర్తి, జుక్కల్) : జుక్కల్ నియోజకవర్గం పిట్లం గ్రామ సర్పంచ్ స్వతంత్ర్య అభ్యర్థిగా నవాబ్ సుదర్శన్ గౌడ్ తన నామినేషన్ ను దాఖలు చేశారు. ఈ మేరకు తన నివాసం నుంచి అనుచరులతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి పిట్లం అభివృద్ధికి దోహదపడతానని ఆయన హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో తన సోదరుడు మహిపాల్ గౌడ్ పిట్లం ఎంపీపీగా ఉన్న సమయంలో గ్రామాభివృద్ధికి చేపట్టిన పనులను గుర్తు చేశారు. పిట్లం గ్రామంలో నిరుద్యోగ ఆడపడుచులకు కుట్టు మిషన్లతో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్, ఇంట్లో ఎవరైనా చనిపోతే తక్షణ ఆర్థిక సాయం, నిరుపేద ఆడపడుచులకు పెళ్లి కానుక, స్కూలు పిల్లలకు నోటు పుస్తకాలు, నిరుద్యోగులకు ఉచిత స్టడీ మెటీరియల్ మరియు ఆన్లైన్ కోచింగ్, పరీక్షల సమయంలో స్టడీ సెంటర్ ఏర్పాటు చేస్తాని సుదర్శన్ గౌడ్ హామీ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామస్తుల క్షేమం కోసం అన్ని ప్రాంతాల్లో సీసీటీవీల ఏర్పాటు, గ్రామ పంచాయతీ స్థలాల యందు ఆహ్లాదకర పార్కుల ఏర్పాటు చేస్తున్నామన్నారు.





# రూ.4.14కోట్ల బీమా సొమ్ము కోసం అన్నను చంపిన తమ్ముడు

కరీంనగర్ నేరవార్తలు: ఇదో కిరాతకుడైన తమ్ముడి దురాఘతం. చేసిన అప్పులు తీర్చడానికి సొంత అన్ననే అంతమొందించిన దారుణ ఘటన కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో జరిగింది. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించిన వివరాల మేరకు రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి నరేశ్ మూడేళ్ల క్రితం రెండు టిప్పర్‌లు కొనుగోలు చేశాడు. వాటిని అద్దెకిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో.. కొన్నాళ్లుగా వ్యాపారం సరిగ్గా సాగకపోవడంతో అప్పులు చేశాడు. నెలనెలా ఈఎంఐలు చెల్లించడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. తెలిసినవారి దగ్గర అప్పులు చేశాడు. దీంతోపాటు షేర్ మార్కెట్లోనూ పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. ఇలా రూ.1.50 కోట్ల వరకు ఇతరులకు బాకీ పడ్డాడు. అప్పుల బాధలు అధికమవడంతో.. తనతోపాటు ఇంట్లోనే ఉంటున్న అవివాహితుడైన అన్న మామిడి వెంకటేశ్(37)ను చంపాలని ప్రణాళిక రూపొందించుకున్నాడు. మానసికంగా పరిపక్వత లేని అన్నను ప్రణాళిక ప్రకారం హత్య చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాలని విఫలమై పోలీసులకు చిక్కాడు.

**బీమా ప్రీమియం చెల్లించి..**

తన అప్పులు తీర్చడానికి మానసికంగా సరిగాలేని అన్న ప్రాణాల్నే పణంగా పెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం రెండు నెలల కిందటి నుంచి అన్న వెంకటేశ్ పేరుపైన నాలుగు ప్రైవేటు బీమా సంస్థలతోపాటు ప్రభుత్వ బీమా సంస్థల నుంచి వేర్వేరుగా రూ.4.14కోట్లకు బీమా పాలసీలు తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ప్రీమియాన్ని చెల్లించాడు. అయితే అదను చూసి అన్నను చంపాలని చూస్తున్నాడు. ఈ క్రమంలోనే నముండ్ల రాకేశ్ అనే వ్యక్తి తనకు చెల్లించాల్సిన రూ.7లక్షల కోసం నరేశ్‌పైన ఒత్తిడి పెంచాడు. దీంతో తన అన్నని ప్రణాళిక ప్రకారం చంపుతున్నానని సహకరిస్తే ఇవ్వాల్సిన రూ.7లక్షలకు అదనంగా రూ.13లక్షలు కలిపి ఇస్తానని రాకేశ్‌ను ఒప్పించాడు. అన్న



వెంకటేశ్ పేరిట కోట్లాది రూపాయల బీమా సొమ్మువస్తుందని, ఆ డబ్బు ఇస్తానని చెప్పి.. ఇందుకోసం రోడ్డు ప్రమాదంలో అన్నను చంపుదామని నిర్ణయించుకున్నారు.

**కుట్ర బయటపడిందిలా..**

ఇందుకోసం టిప్పర్ డ్రైవర్ ప్రదీప్‌ను ఒప్పించారు. ఒప్పంద సమయంలోనే వీరు ముగ్గురు ఒకవేళ తప్పిదం బయటకు వస్తే ముగ్గురం ఆ శిక్షను భరించాలని భావించి ప్రణాళిక చేస్తున్న సమయంలోనే ముగ్గురూ కనిపించే విధంగా వీడియో రికార్డు చేసుకున్నారు. ప్రణాళికలో భాగంగా గత నెల 29న రాత్రి 11 గంటలకు గ్రామశివారులోని పెట్రోల్ బంక్ పక్కన రహదారిపై టిప్పర్ ఆగిపోయిందని డ్రైవర్ ఫోన్ చేసి నరేశ్‌కు చెప్పాడు. ఈ క్రమంలోనే తన అల్లుడు సాయి బైక్‌పై అన్న వెంకటేశ్‌ను ఎక్కించి టిప్పర్ వద్దకు పంపించాడు. వెనుకాలే నరేశ్ కూడా వెళ్లాడు. టిప్పర్ చక్రం కింద జాకీ పెట్టాలని.. వెంకటేశ్‌ని కింద పడుకోబెట్టి నరేశ్ టిప్పర్‌ను నడుపుతూ ముందుకు కదిలించాడు. దీంతో వెంకటేశ్ టైర్లకిందపడి అక్కడికక్కడే చనిపోయాడు. డ్రైవర్‌పైన కేసును నెట్టాలని అతన్ని పారిపోమ్మన్నాడు. ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదమని.. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లనేనని పోలీసుల్ని నమ్మించాడు. అయితే బీమా సంస్థకు సంబంధించిన ప్రతినిధులకు నరేశ్ చెప్పే విధానంపై అనుమానం వచ్చి పోలీసుల్ని ఆశ్రయించగా.. పోలీసులు విచారణలో అసలు నిగ్గు తేల్చారు. దీంతోపాటు నరేశ్ అల్లుడైన సాయి కూడా ప్రమాద సమయంలో టిప్పర్‌ను నడిపింది డ్రైవర్ కాదని నరేశ్ అని చెప్పడంతో కుటుంబీలకు అనుమానం వచ్చింది. బీమా సొమ్ము కోసమే చంపానని పోలీసుల విచారణ నరేశ్ అంగీకరించినట్టు సీపీ తెలిపారు. ఈ మేరకు నరేశ్‌తోపాటు రాకేశ్, డ్రైవర్ ప్రదీప్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



## ఫాల్కన్ కేసులో వేలానికి జెట్ విమానం

హైదరాబాద్: మనీ లాండరింగ్ కేసులో సీజ్ చేసిన జెట్ విమానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేలం వేయనుంది. ఈ నెల 9న మెటల్ స్క్రాప్ ట్రేడ్ కార్పొరేషన్ ద్వారా ఈ విమానాన్ని వేలం వేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ పేరుతో అమర్దీప్‌సింగ్ మోసాలకు పాల్పడిన విషయం తెలిసిందే. అతడిని అరెస్ట్ చేయడంతోపాటు అతని వద్ద ఉన్న హాకర్ 800ఏ జెట్ విమానాన్ని గతంలో శంషాబాద్‌లో పోలీసులు సీజ్ చేశారు. ప్రస్తుతం ఆ విమానం బేగంపేట విమానాశ్రయంలో ఉంది. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని బాధితులకు ఇవ్వనున్నట్లు ఈడీ పేర్కొంది.

## అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి

టేక్మాల్ (మెదక్): దంపతులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామంలో వెలుగుచూసింది. గ్రామానికి చెందిన శ్రీశైలం (40) మంజుల (35) భార్యాభర్తలు. ఇంట్లో నిద్రించిన స్థలంలోనే భార్య మృతదేహమై కనిపించగా.. భర్త ఉరేసుకున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎలా మృతి చెందారు? ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.





## తెలంగాణ విజన్ డాక్యుమెంట్–2047లో
## మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధికి పెద్ద పీట

తెలంగాణ విజన్ డాక్యుమెంట్-2047రూపకల్పనలో భాగంగా మహిళల సాధికారత, ఆర్థిక అభివృద్ధి, సంరక్షణ పోషకాహారం అంశాలపై చేపట్టాల్సిన కీలక చర్యలపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మంగళవారం ప్రజాభవన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజ, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ పాల్గొన్నారు. సమావేశంలో మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల విస్తరణకు సంబంధించి విభిన్న అంశాలపై మంత్రి సీతక్క పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు 52.7 శాతంగా ఉందని, దానిని 2047 నాటికి 95 శాతానికి చేరేలా విజన్ డాక్యుమెంట్ రూపకల్పన చేయాలని సూచించారు. మహిళల ఉపాధి ఉద్యోగ అవకాశాలను విస్తృతంగా పెంచేందుకు సమగ్రమైన వ్యూహం ఉండాలని ఆమె స్పష్టం చేశారు. మహిళల సంరక్షణ, పోషకాహారం ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని మంత్రి పేర్కొన్నారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేసే లక్ష్యంతో విభిన్న వ్యాపారాల్లో మహిళలను ప్రొత్సహించేలా విజన్ 2047 డాక్యుమెంట్ ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా యూనిఫాంలు కుట్టించడాన్ని ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది మహిళా సంఘాలకు రూ. 30 కోట్లు పైగా ఆదాయం లభిస్తోందని చెప్పారు.

## సర్పంచ్‌లు మంచోళ్లు ఉంటేనే గ్రామాలు అభివృద్ధి

**: సీఎం రేవంత్‌రెడ్డి**

కొత్తగూడెం: ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్తగూడెంలో ఎర్త్ సైన్సెస్ వర్సిటీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలను తీర్చింది ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్.. అందుకే దేశంలో ఉన్న ఏకైక ఎర్త్ సైన్స్ వర్సిటీకి ఆయన పేరు పెట్టామని తెలిపారు. ‘‘తెలంగాణ ఉద్యమానికి పునాది రాయి పడింది ఇక్కడే. రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన మన్మోహన్‌సింగ్ పేరుతో ఎర్త్ సైన్స్ వర్సిటీ ఏర్పాటు చేసుకోవడం గర్వకారణం. ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలే ప్రపంచపటంలో తెలంగాణను నిలబెడుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. భద్రాచలం రాముల వారి సాక్షిగా చెబుతున్నా.. అన్ని జిల్లాలతో పాటు ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నాది. పాలనకు ఆయువుపట్టయిన శాఖలన్నీ ఖమ్మం జిల్లా మంత్రుల చేతుల్లోనే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మీరంతా ఓట్లేసి గెలిపిస్తేనే.. ప్రజలకు మంచి పాలన అందిస్తున్నాం. మంచి ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు వస్తాయి. గ్రామాల్లో సర్పంచ్‌లు కూడా మంచోళ్లు ఉండాలి. మంత్రులతో కలిసి పనిచేసే మంచి



సర్పంచి మీ ఊళ్లో లేకపోతే.. గ్రామాలు దెబ్బతింటాయి. రాజకీయ కక్షలు మాని పదేళ్లు అండగా నిలబడండి. తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడదాం. సర్పంచ్ ఎన్నికల్లో మంత్రులు, తుమ్మల, భట్టి, పొంగులేటితో కలిసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించే వారిని ఎన్నుకోండి’’ అని సీఎం విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్’
## ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన తెలంగాణ డీజీపీ

హైదరాబాద్: మన అప్రమత్తతే సైబర్ నేరాల బారిన పడకుండా కాపాడుతుందని తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలపై అవగాహనకు రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ‘ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్’ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఆరు వారాలపాటు ఈ ప్రచార కార్యక్రమం




నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పేద, ధనిక తేడా లేకుండా అందరూ సైబర్ నేరాలకు గురవుతున్నారని చెప్పారు. అత్యాశ వల్లే చాలా మంది నష్టపోతున్నారని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దేశవ్యాప్తంగా గతేడాది సైబర్ నేరాలు పెరిగితే.. తెలంగాణలో తగ్గాయని చెప్పారు.

## మహేశ్వరంలో రూ.8వేల కోట్లతో
## డ్రోన్లకు ప్రత్యేక డిఫెన్స్ ఫెసిలిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: దేశంలోనే మొట్టమొదటిసారిగా తెలంగాణలో డ్రోన్లకు ప్రత్యేక డిఫెన్స్ ఫెసిలిటీని జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఏర్పాటు చేయడం రాష్ట్రానికి గర్వకారణమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో జెఎస్‌డబ్ల్యూ డ్రోన్ కంపెనీ ఏర్పాటుకు పార్థ జిందాల్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రూ.8వేల కోట్ల అంచనా వ్యయంతో దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో కుదిరిన ఒప్పందం ప్రకారం ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ ఫెసిలిటీతో మహేశ్వరంలో భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. అనేక రాష్ట్రాలు ఆహ్వానించినప్పటికీ జేఎస్‌డబ్ల్యూ సంస్థ తెలంగాణను ఎంచుకోవడం రాష్ట్ర పారిశ్రామిక విధానం బలాన్ని చాటుతుందని తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో జరగబోయే గ్లోబల్ సమ్మిట్ ద్వారా మరిన్ని పెట్టుబడులు రాబోతున్నాయని, రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వివరించారు.



## కేంద్రం ఇప్పటి వరకు ఏ సిటీకి నిధులు ఆపలేదు
## : రామచందర్‌రావు

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీకి నిధులు ఇవ్వకపోతే భాజపాని భూస్థాపితం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం పట్ల ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజమే రేవంత్‌రెడ్డి సర్కార్‌ని భూస్థాపితం చేస్తుందన్నారు. ఇప్పటి వరకు కేంద్రం ఏ సిటీకి నిధులు ఆపలేదన్నారు. ఫ్యూచర్ సిటీ ఎవరిని అడిగి కడుతున్నారని ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసుపై రామచందర్‌రావు



స్పందిస్తూ.. నేషనల్ హెరాల్డ్ భూముల లెక్కలు ఎవరికీ తెలియదని, సుప్రీంకోర్టు తీర్పు ద్వారానే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని చెప్పారు. ‘‘డిజిటల్ ఇండియాలో అనేక మార్పులు జరుగుతాయి. సంచార్ సాథీ కూడా డిజిటల్ ఇండియాలో భాగమే. ఏ యాప్ తెచ్చినా ప్రజల సంక్షేమం కోసమే. కాంగ్రెస్ భాజపాపై తప్పుడు ప్రచారం చేస్తోంది’’ అని ఎన్.రామచందర్‌రావు అన్నారు.

# మద్యం విక్రయించినా, సేవించినా ప్రభుత్వ ప్రయోజనాలుండవ్ - పంచాయతీ నిర్ణయం

బనాస్‌కాంతా: గుజరాత్‌లోని బనాస్‌కాంతా జిల్లా ఛాప్రా గ్రామ పంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది. మద్యం విక్రయించే లేదా సేవించే వారికి పంచాయతీ అందించే ప్రభుత్వ సేవలు అందించకూడదని ఏకగ్రీవంగా తీర్మానించింది. ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యాలయంలో నోటీసును అంటించింది. ఈ నిర్ణయాన్ని గ్రామ యువత, మహిళలు స్వాగతిస్తున్నారు. ఛాప్రా గ్రూపు గ్రామ పంచాయతీ పరిధిలో 5వేల జనాభా ఉండగా గిరిజనులే అధికం. స్థానికంగా ఉన్న కొన్ని అక్రమ మద్యం కేంద్రాలతో యువత జీవితాలు నాశనమవుతున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కుటుంబ తగాదాలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కావద్దని భావించిన గ్రామ పెద్దలు.. మద్యం విక్రయం, సేవిస్తే ప్రభుత్వ ప్రయోజనాలను అందించకూడదని నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని, తద్వారా మహిళలు, యువతను కాపాడుకోవచ్చని గ్రామస్థులు భావిస్తున్నారు. గుజరాత్‌లో మద్యనిషేధం ఉన్నప్పటికీ అక్రమ రవాణా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. గడిచిన మూడు నెలల్లోనే బనాస్‌కాంతా జిల్లా పోలీసులు రూ.19.59 కోట్ల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నరంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బనాస్‌కాంతా జిల్లాలో అక్రమ మద్యం రవాణాకు సంబంధించి 3164 కేసుల్లో 3372 మందిని అరెస్టు చేశారు.





## అయ్యప్ప భక్తుల రద్దీ.. మరో 10 ప్రత్యేక రైళ్లు.. బుకింగ్ ఎప్పట్నుంచంటే?

శబరిమల వెళ్లే భక్తులకు గుడ్‌న్యూస్. ఇప్పటికే 60 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే అధికారులు.. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని తాజాగా మరో 10 ప్రత్యేక రైళ్లు నడపాలని నిర్ణయించారు. ఈ ప్రత్యేక రైలు సర్వీసులు తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు నడపనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 13 నుంచి 31 మధ్య వివిధ తేదీల్లో ఈ రైళ్లు సర్వీసులందించనున్నాయి.

## సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే నెల రోజులు తిరిగిన విమానం..!




సేఫ్టీ సర్టిఫికేట్ లేకుండానే నెల రోజులపాటు దేశీయ విమానయాన సంస్థ ఎయిరిండియాకు చెందిన విమానం ఒకటి రాకపోకలు కొనసాగించడం కలకలం సృష్టిస్తోంది. అంతర్గత తనిఖీల్లో ఈ విషయం బయటపడింది. ఇటీవల ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన నేపథ్యంలో ఈ భారీ భద్రతా వైఫల్యం వెలుగులోకి రావడం గమనార్హం. ఎయిర్‌వర్తీనెస్ రివ్యూ సర్టిఫికేట్ లేకుండానే నవంబర్‌లో ఎయిరిండియా లోని ఎయిర్‌బస్ విమానం సర్వీసులు కొనసాగించిందని సంస్థ అంతర్గత పర్యవేక్షణ ప్రక్రియలో బయటపడింది. ఈ విషయాన్ని వెంటనే డీజీసీఏకు నివేదించింది. ఈ వైఫల్యానికి కారకులైన సిబ్బందిని సస్పెండ్ చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎయిరిండియా వెల్లడించింది. తాము భద్రతా ప్రమాణాలకు కట్టుబడి ఉన్నామని డీజీసీఏకు ఇచ్చిన నివేదికలో పేర్కొంది. ఇలాంటి ఉదాసీనతను తీవ్రంగా పరిగణిస్తామని ఒక ప్రకటనలో వెల్లడించింది. వాణిజ్య విమానాల కార్యకలాపాలకు ఈ ఎయిర్‌వర్తీనెస్ రివ్యూ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలి. విమానం రాకపోకలు సాగించేవిధంగా అన్ని భద్రతా ప్రమాణాలను పాటిస్తుందని ఇది ధ్రువీకరిస్తుంది. ఎయిర్‌క్రాఫ్ట్ కండీషన్, రికార్డులను విస్తృతంగా సమీక్షించిన తర్వాత ఈ సర్టిఫికేట్ ఇస్తారు. దీనిని ఏడాదికి ఒకసారి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది.

**సౌర రేడియో ధార్మికతతో**

ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ వ్యవస్థలు దెబ్బతింటున్నాయని ఇటీవల వార్తలు వచ్చాయి. ఇటీవల ఎయిర్‌బస్‌కు చెందిన జెట్ బ్లూ ఏ320 అనే విమానానికి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. అనంతరం ఎయిర్‌బస్ ఏ320 విమానాల్లో సాఫ్ట్‌వేర్ సమస్యను పరిష్కరించినట్లు డీజీసీఏ ఇటీవల వెల్లడించింది. మొత్తం 323 విమానాల్లో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది.

## భాజపా తరపున 'సోనియా గాంధీ'.. కేరళ స్థానిక ఎన్నికల్లో విచిత్రం..



కేరళలో వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో ప్రధాన రాజకీయ పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో మున్నార్ పంచాయతీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థిగా పోటీ చేస్తున్న మహిళ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పేరే ఆమెకూ ఉండడమే దానికి కారణం. భాజపా అభ్యర్థి 'సోనియా గాంధీ' తండ్రి, దివంగత దురే రాజ్ గతంలో కాంగ్రెస్ కార్యకర్తగా పని చేశాడు. తమ పార్టీ అగ్రనేత సోనియా గాంధీపై ఉన్న అభిమానంతో తన కుమార్తెకు ఆమె పేరును పెట్టుకున్నాడు. కొన్నేళ్ల క్రితం ఆమెకు భాజపా కార్యకర్త, పంచాయతీ ప్రధాన కార్యదర్శి సుభాష్‌తో వివాహం అయింది. భర్త మద్దతుతో సోనియా గాంధీ త్వరలో జరగనున్న మున్నార్ పంచాయతీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థిగా బరిలోకి దిగారు. మున్నార్ పంచాయతీ స్థానం నుంచి పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి మంజుల రమేష్‌కు ఇది తల నొప్పిగా మారింది. కాంగ్రెస్ ప్రత్యర్థికి తమ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పేరుండడం వల్ల ఎన్నికల సమయంలో ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల ఎన్నికల ఫలితాలూ ప్రభావితం అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొంటున్నాయి. ఇక కేరళలో రెండు దశల్లో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 9, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. 13న ఫలితాలు వెలువడనున్నాయి.

## సినీఫక్కీలో అర్ధరాత్రి ఎన్‌కౌంటర్.. గ్యాంగ్‌స్టర్ హతం



సినీఫక్కీలో అర్ధరాత్రి జరిగిన ఎన్‌కౌంటర్‌లో బవేరియా గ్యాంగ్ లీడర్ మిథున్ హతమయ్యాడు ఉత్తర్‌ప్రదేశ్‌లో బిదోలీ సమీపంలో దట్టమైన అడవుల్లో ఈ ఘటన చోటుచేసుకుంది. 20 కేసుల్లో వాంటెడ్‌గా ఉన్న అతడి తలపై రూ.1.25 లక్షల రివార్డు ఉందని పోలీసులు వెల్లడించారు. ఝింఝానా ప్రాంతంలో బవేరియా గ్యాంగ్ నేరపూరిత చర్యలకు పాల్పడేందుకు యత్నిస్తుందని సోమవారం పోలీసులకు సమాచారం అందింది. దాని ఆధారంగా పోలీసులు, ప్రత్యేక దర్యాప్తు బృందాలు ఆ గ్యాంగ్ ఉన్న ప్రాంతానికి చేరుకున్నాయి. అరెస్టు తప్పించుకునేందుకు ముఠా సభ్యులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారని, దాంతో పోలీసులు ఎదురుకాల్పులు జరపాల్సి వచ్చిందని అధికారులు వెల్లడించారు. దాంతో మిథున్ ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. కానీ అతడి అనుచరుడు ఒకరు తప్పించుకున్నాడని చెప్పారు. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్ గాయపడగా.. పోలీస్ ఇన్‌స్పెక్టర్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని వెల్లడించారు

## అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారు: సిద్ధరామయ్య



కర్ణాటకలో సీఎం సీటుపై రగడ కొనసాగుతున్న వేళ.. మరోసారి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. మంగళవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నివాసానికి సీఎం సిద్ధరామయ్య వెళ్లారు. అనంతరం డీకే శివకుమార్‌కు సీఎం పదవిపై సిద్ధరామయ్య మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. అధిష్ఠానం ఎప్పుడు ఆదేశిస్తే.. అప్పుడే డీకే సీఎం అవుతారన్నారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలే పార్టీ ప్రధాన లక్ష్యమని ఇరువురు నేతలు పేర్కొన్నారు. అల్పాహారం అనంతరం డీకేతో అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, రైతుల సమస్యలు సహా పలు ఇతర విషయాలపైనా చర్చించినట్లు సిద్ధరామయ్య తెలిపారు. ఈ విషయాల్లో చర్చలు జరపడానికి పార్టీ హైకమాండ్ పిలిస్తే తాము ఇద్దరం దిల్లీకి వెళ్లడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వంలోని నేతలంతా ఐక్యంగా ఉన్నామని.. రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి పని చేస్తున్నామన్నారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. డిసెంబర్ 8న కాంగ్రెస్ ఎంపీల సమావేశం నిర్వహించడానికి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల డీకే శివకుమార్ సిద్ధరామయ్య నివాసానికి వెళ్లి.. అల్పాహారం చేసిన విషయం తెలిసిందే. అనంతరం ఇరువురు మీడియాతో మాట్లాడుతూ.. నాయకత్వ మార్పుపై కొద్ది రోజులుగా అందరిలో ఉన్న గందరగోళానికి తెరదించేందుకే ఈ బ్రేక్‌ఫాస్ట్ భేటీ జరిగిందన్నారు. భాజపా జేడీఎస్ తమపై అసత్య ప్రచారాలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ఉమ్మడిగా ఎదుర్కొంటామన్నారు. తమ మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని స్పష్టంచేశారు. ఇందులోభాగంగానే నేడు మరోసారి డీకే నివాసంలో భేటీ అయ్యారు.

## నాందేడ్ పరువు హత్య కేసులో కీలక విషయాలు వెలుగులోకి



ప్రేమించిన వ్యక్తిని తండ్రి, సోదరుడు హత్య చేయగా.. ఓ యువతి తన ప్రియుడి మృతదేహాన్ని పెళ్లి చేసుకున్న ఘటన ఇటీవల మహారాష్ట్రలోని నాందేడ్‌లో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ పరువు హత్య కేసులో మరో కీలక విషయం బయటకు వచ్చింది. హంతకుల కుటుంబంతో మృతుడు సక్షమ్ టాటేకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో నిందితులు గజానన్, సాహిల్, హిమేష్‌తో కలిసి సక్షమ్ డ్యాన్స్ చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అచల్, ఆమె తండ్రి గజానన్ కొందరు యువకులతో కలిసి నృత్యం చేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వారిలో సక్షమ్ కూడా ఉన్నాడు. తన కుటుంబసభ్యులు సక్షమ్‌తో సన్నిహితంగా ఉండేవారని.. తమ వివాహానికి కూడా ఒప్పుకున్నారని అచల్ జాతీయమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. అయితే పెళ్లి జరగాలంటే అతడు మతం మార్చుకోవాలని షరతు పెట్టడంతో అందుకు కూడా ఒప్పుకున్నాడని.. అంతలోనే ఈ దారుణం జరిగిందని వాపోయింది. సక్షమ్‌ను హత్య చేయడానికి ముందు తన సోదరులు తనను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి.. అతడిపై కేసు పెట్టాలని ఒత్తిడి చేశారని తెలిపింది. అందుకు తాను నిరాకరించడంతో.. సక్షమ్‌ను హత్య చేసినట్లు ఆరోపించింది. వారికి పోలీసులు కూడా సహకరించినట్లు పేర్కొంది. తమ కుమార్తె వేరే కులం వ్యక్తిని ప్రేమించిందని, ఈ విషయం బయటకు తెలిస్తే తమ పరువు పోతుందని భావించిన గజానన్ అనే వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి.. కుమార్తె ప్రేమించిన వ్యక్తిని హత్య చేసిన ఘటన ఇటీవల మహారాష్ట్రలోని నాందేడ్‌లో చోటుచేసుకుంది. దీంతో యువతి తల్లిదండ్రులు, ఇద్దరు సోదరులు, వారి స్నేహితులు సహా మొత్తం 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు సక్షమ్ అంతిమ సంస్కారాల్లో పాల్గొన్న అచల్ ప్రాణం పోయినా అతడే తన భర్త అంటూ ప్రియుడి మృతదేహాన్ని వివాహం చేసుకుంది. అతడిని హత్య చేసిన తన కుటుంబసభ్యులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేసింది.

### మానవబాంబు అంటూ బెదిరింపు..

## హైదరాబాద్ వస్తోన్న విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్




మానవబాంబు ఉందంటూ బెదిరింపు రావడంతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. కువైట్ నుంచి హైదరాబాద్ వస్తోన్న విమానంలో ఈ భయానక ఘటన చోటుచేసుకుంది. దాంతో అధికారులు విమానాన్ని ముంబయికి దారి మళ్లించారు. సంబంధిత అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. కువైట్ నుంచి వస్తోన్న ఇండిగో విమానం (6E1234) మంగళవారం హైదరాబాద్‌లో ల్యాండ్ కావాల్సిఉంది. అది రావడానికి ముందు హైదరాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. విమానంలో మానవబాంబు ఉందని ఆ మెయిల్ పంపిన దుండగులు బెదిరించారు. దాంతో అప్రమత్తమైన అధికారులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా విమానాన్ని దారి మళ్లించి, ముంబయిలో అత్యవసరంగా దింపారు. తర్వాత విమానంతో సహా ప్రయాణికులను ఐసోలేషన్ ప్రాంతానికి తరలించి, ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులంతా సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల సంఖ్య తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

# భారత్‌లో టెస్లాకు గిరాకీ నిల్..

## అమ్మకాల్లో వెనుకబడ్డ ఈవీ దిగ్గజం




**న్యూఢిల్లీ:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులై 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఆ తర్వాత ఢిల్లీలో రెండో షోరూంను కూడా లాంఛ్ చేసిన విషయం తెలిసిందే. ఎన్నో అంచనాలతో భారత విపణిలోకి అడుగుపెట్టిన టెస్లాకు నిరాశ తప్పలేదు. ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగలేదని తెలిసింది.

సెప్టెంబర్‌లో డెలివరీలు మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు కేవలం 157 కార్లను మాత్రమే టెస్లా విక్రయించినట్లు ప్రభుత్వ వాహన్ పోర్టల్ గణాంకాలు చెబుతున్నాయి. ఇక నవంబర్ నెలలో టెస్లా కేవలం 48 కార్లను మాత్రమే డెలివరీ చేసింది. ఈవీ అమ్మకాల్లో బీఎమ్‌డబ్ల్యూ, మెర్సిడెస్-బెంజ్ వంటి లగ్జరీ సంస్థల కంటే టెస్లా వెనుకబడింది. బీఎమ్‌డబ్ల్యూ ఇండియా నవంబర్‌లో ఏకంగా 267 ఈవీ కార్లను విక్రయించినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది.

వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోందన్నది టాక్.

# మార్కెట్లకు లాభాల స్వీకరణ సెగ..

**500 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్**

**నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**503 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 143 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**ఆర్బీఐ పాలసీ సమావేశంపై నెలకొన్న ఆందోళనలు**

**ఎఫ్ఐఐల అమ్మకాలు, రూపాయి బలహీనత ప్రధాన కారణాలు**

**బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి**



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నాడు నష్టాలతో ముగిశాయి. లాభాల స్వీకరణ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాల ఒత్తిడి, ఈ వారం జరగనున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక పాలసీ సమావేశంపై నెలకొన్న ఆందోళనలు సూచీల పతనానికి దారితీశాయి. ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం, ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 503.63 పాయింట్లు నష్టపోయి 85,138.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 143.55 పాయింట్లు తగ్గి 26,032.20 వద్ద ముగిసింది.

ఉదయం సెషన్ 85,325.51 వద్ద నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా అమ్మకాల ఒత్తిడికి గురైంది. బ్యాంకింగ్, ఐటీ వంటి ప్రధాన రంగాల షేర్లలో అమ్మకాలతో ఇంట్రాడేలో 85,053.0 కనిష్ఠ స్థాయిని తాకింది. బలహీనపడుతున్న రూపాయి, కొనసాగుతున్న ఎఫ్ఐఐల అమ్మకాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయని విశ్లేషకులు తెలిపారు. మరోవైపు, బలమైన జీడీపీ గణాంకాల నేపథ్యంలో ఆర్బీఐ వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు తగ్గడం కూడా ఇన్వెస్టర్లను అప్రమత్తం చేసింది.

దాదాపు అన్ని రంగాల సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ బ్యాంక్ 0.68 శాతం, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.10 శాతం మేర పతనమయ్యాయి. దీనికి విరుద్ధంగా, పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.5 శాతం లాభపడింది.

సెన్సెక్స్ బాస్కెట్‌లో ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, పవర్‌గ్రిడ్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా నష్టపోగా.. ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి. బ్రాడర్ మార్కెట్‌లో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా నష్టాలతోనే ముగిశాయి.

# ఇండిగోకు జీఎస్టీ షాక్..

**రూ. 117 కోట్ల భారీ జరిమానా**

**ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు భారీ జరిమానా**

**రూ. 117.52 కోట్లు చెల్లించాలని జీఎస్టీ శాఖ ఆదేశం**

**ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు**

**ఈ ఆదేశాలను కోర్టులో సవాలు చేస్తామన్న కంపెనీ**



**న్యూఢిల్లీ:** ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్‌కు జీఎస్టీ విభాగం నుంచి భారీ షాక్ తగిలింది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ నిబంధనలకు సంబంధించి కొచ్చి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ రూ. 117.52 కోట్ల జరిమానా విధించింది. ఈ మేరకు మంగళవారం కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది.

2018-19, 2021-22 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి కంపెనీ క్లెయిమ్ చేసిన ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను జీఎస్టీ అధికారులు తిరస్కరించారు. ఈ నేపథ్యంలోనే రూ. 1,17,52,86,402 జరిమానాతో పాటు డిమాండ్ ఆర్డర్ జారీ చేసినట్లు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ తన ఫైలింగ్‌లో పేర్కొంది.

అయితే, అధికారుల ఆదేశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని, దీనిపై న్యాయపరంగా తమకు గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది. పన్ను నిపుణుల సలహాతో ఈ ఆదేశాలను ఉన్నత అధికారిక ఫోరంలో సవాలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. ఈ జరిమానా ప్రభావం కంపెనీ ఆర్థిక వ్యవహారాలు, కార్యకలాపాలపై పెద్దగా ఉండబోదని కూడా వివరించింది. ఈ వార్తల నేపథ్యంలో ఇంట్రా-డే ట్రేడింగ్‌లో ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేరు ధర రూ.95 (1.64%) మేర తగ్గింది.

మరోవైపు ఇవాళ ఉదయం కువైట్ నుంచి హైదరాబాద్ వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో దాన్ని ముంబైకి మళ్లించిన విషయం తెలిసిందే.



# రెజ్లర్స్‌కు షాక్..

**పిటిషన్లు కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు**




**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టులో అగ్రశ్రేణి రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, వినేష్ ఫోగట్, సత్యవర్త్ కడియన్‌లకు ఎదురుదెబ్బ తగిలింది. భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలను సవాలు చేస్తూ వారు దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చింది. రెజ్లర్లు కోర్టు ఎదుట హాజరుకాకపోవడంతో.. హైకోర్టు పిటిషన్లను కొట్టివేసింది. సంజయ్ సింగ్ డబ్ల్యూఫ్ఐ అధ్యక్ష ఎన్నికల్లో అనితా షియోరన్‌పై గెలుపొందారు. అనితకు రెజ్లర్ల మద్దతు తెలిపారు.

నవంబర్ 27న ఈ కేసును విచారించిన జస్టిస్ మినీ పుష్కర్ణ విచారణ సమయంలో పిటిషనర్లు ఎవరూ కోర్టుకు రాకపోవడాన్ని గమించారు. ఈ అంశం పలుసార్లు విచారణకు వచ్చినా విచారణకు హాజరుకాలేదు. దాంతో కోర్టు 'ఈ విషయాన్ని ముందుకు తీసుకెళ్లడంలో పిటిషనర్లకు ఆసక్తి లేనట్లు కనిపిస్తోంది' అని పేర్కొంది. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ ఎన్నికలు న్యాయమైన, పారదర్శక వాతావరణంలో జరుగలేదని రెజర్లు ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో లోపాలు, అక్రమాలు జరిగాయంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, విచారణకు రెజర్లు హాజరుకాకపోవడంతో ఆయా పిటిషన్లు ఢిల్లీ కోర్టు కొట్టివేసింది.

# అలాంటి ఆటగాళ్లు వదులుకోవడం అంత తేలికైన విషయం కాదు : హేమంగ్ బదానీ



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా డ్యాషింగ్ బ్యాట్స్‌మెన్ ఫఫ్ డు ప్లెసిస్‌ను జట్టును తప్పించడం అంత తేలిక నిర్ణయం కాదని ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్ హేమంగ్ బదాలీ పేర్కొన్నారు. డు ప్లెసిస్ తన ఐపీఎల్ కెరీర్‌లో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, రైజింగ్ పూణే సూపర్‌జెయింట్స్ బరిలోకి దిగాడు. గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌లో సభ్యుడిగా ఉన్నాడు. అయితే, బదానీ మాట్లాడుతూ 'ఫఫ్ డు ప్లెసిస్ లాంటి ఆటగాడిని వదులుకోవడం అంత సులభం కాదు. సంవత్సరాలుగా ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించాడు. అతని జట్టులో నుంచి తప్పించడం కఠినమైన నిర్ణయం' అని జియోస్టార్‌లో జరిగిన టాటా ఐపీఎల్ రిటెన్షన్ షోలో బదానీ వ్యాఖ్యానించాడు.

మరింత దూకుడుగా ఉండే, జట్టు ఆటతీరుకు అనుగుణంగా మారే యువ ప్లేయర్ల కోసం ప్రయత్నించాల్సిన సమయం ఆసన్నమైందని భావించామని తెలిపాడు. ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ జాక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్‌ను విడుదల చేయాలనే నిర్ణయంపై బదానీ స్పందిస్తూ.. గత సీజన్‌లో ప్రదర్శన ఆధారంగా అతనికి మద్దతు ఇచ్చామని.. కానీ అతనికి రూ.9 కోట్లు ఇవ్వడం సాధ్యం కాదని ప్రస్తుతం భావించి.. అతన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌లో మంచి భారతీయ ప్లేయర్లు ఉన్నారని.. కానీ ఓపెనింగ్ జోడీపై పని చేయాల్సిన అవసరం ఉందని భారత జట్టు మాజీ హెడ్‌కోచ్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డారు. నితీశ్ రాణా, కేఎల్ రాహుల్, అభిషేక్ పోరెల్, కరుణ్ నాయర్ జట్టులో ఉన్నారని.. టాప్ ఆర్డర్‌లో ఎవరు ఎక్కడ ఆడాలో నిర్ణయించాల్సి ఉంటుందన్నారు.

# ఐపీఎల్ వేలానికి గ్లెన్ మ్యాక్స్‌వెల్ దూరం



**సిడ్నీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ కోసం జరిగే ఆటగాళ్ల వేలానికి ఆస్ట్రేలియా క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ దూరం అయ్యారు. క్రికెటర్ల వేలానికి అందుబాటులో ఉండడం లేదని ఆసీస్ బ్యాటర్ ఇవాళ ప్రకటించాడు. డిసెంబర్ 16వ తేదీన అబుదాబిలో ఐపీఎల్ ప్లేయర్ల వేలం జరగనున్నది. అయితే ఐపీఎల్‌లో అతను 2012 సీజన్ నుంచి ఆడుతున్నాడు. హిట్టర్‌గా పేరుగాంచిన మ్యాక్స్‌వెల్ 2019 సీజన్‌లో మాత్రం ఆడలేదు. ఇక అతను 141 మ్యాచుల్లో కేవలం 2819 రన్స్ మాత్రమే చేవాడు. అతనికి స్ట్రయిక్ రేట్ 155 ప్లస్‌గా ఉన్నది. బ్యాటింగ్ యావరేజ్ 24గా ఉంది. అయితే ఐపీఎల్ వేలంలో అతనికి ఫ్రాంచైజీలు ఎక్కువే సమర్పిస్తున్నా.. మ్యాక్స్‌వెల్ మాత్రం ఆశించిన రీతిలో సక్సెస్ సాధించలేదు. స్పిన్ బౌలింగ్ వేసే మ్యాక్స్‌వెల్ .. ఐపీఎల్‌లో కేవలం 41 వికెట్లు తీసుకున్నాడు.

ఐపీఎల్‌లో ఎన్నో మరుపురాని సీజన్స్ ఆడానని, అయితే ఈ ఏడాది జరిగే ఆటగాళ్ల వేలానికి తమ పేరును సమర్పించడం లేదని మ్యాక్స్‌వెల్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ప్రకటించాడు. తాను తీసుకున్నది పెద్ద నిర్ణయమని, ఐపీఎల్ లీగ్ తనకు ఎంతో పేరుప్రఖ్యాతలు తీసుకువచ్చిందన్నారు. ఓ క్రికెటర్‌గా, ఓ వ్యక్తిగా తనను ఐపీఎల్ తీర్చిదిద్దినట్లు మ్యాక్స్ తన ఇన్‌స్టా పేజీలో చెప్పాడు.

ఐపీఎల్‌లో మొత్తం 13 సీజన్లు ఆడాడు మ్యాక్స్‌వెల్. వాటిల్లో 2021 సీజన్‌లో అతను 500 స్కోరు దాటాడు. ఆ సీజన్‌లో అతను ఆరు అర్ధశతకాలు చేశడు. 144 ప్లస్ స్ట్రయిక్ రేట్ ఉన్నది. గడిచిన రెండు సీజన్లలో, అంటే 2024, 2025లో మ్యాక్సీ పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా పడిపోయింది. రెండు సీజన్లలో అతను 17 మ్యాచుల్లో కేవలం వంద రన్స్ మాత్రమే చేశాడు. 2024లో 52, 2025లో 48 రన్స్ మాత్రమే స్కోరు చేశాడు. గత సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడిన తర్వాత స్వదేశం వెళ్లిన మ్యాక్సీ మళ్లీ వెనక్కి రాలేదు.

# మరోసారి పరుగుల విధ్వంసం సృష్టించిన అభిషేక్ శర్మ

**సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ పోటీల్లో కొనసాగుతున్న అభిషేక్ ఫామ్**

**బరోడాపై 18 బంతుల్లోనే మెరుపు హాఫ్ సెంచరీ**

**20 ఓవర్లలో 222 పరుగులు చేసిన పంజాబ్**

**పునరాగమన మ్యాచ్‌లో తేలిపోయిన హార్దిక్ పాండ్యా**

**బరోడా ముందు 223 పరుగుల భారీ లక్ష్యం**



**బెంగాల్:** సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో పంజాబ్ కెప్టెన్ అభిషేక్ శర్మ పరుగుల విధ్వంసం కొనసాగిస్తున్నాడు. బరోడాతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మరోసారి తన బ్యాటింగ్ పవర్ చూపించాడు. కేవలం 18 బంతుల్లోనే 5 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 50 పరుగులు చేశాడు. మెరుపు అర్ధశతకం సాధించి అదరగొట్టాడు. అభిషేక్ జోరుకు తోడు, అన్మోల్‌ప్రీత్ సింగ్ (32 బంతుల్లో 69 పరుగులు), నమన్ ధీర్ (28 బంతుల్లో 39 పరుగులు) కూడా రాణించడంతో పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది.

ఇటీవల బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో 52 బంతుల్లో 148 పరుగులు చేయడమే కాకుండా, కేవలం 12 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి రికార్డు సృష్టించాడు. ఇప్పుడు బరోడాపై కూడా అదే ఫామ్ కొనసాగించడంతో టోర్నీలో పంజాబ్ దూకుడుగా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పంజాబ్ నిర్దేశించిన 223 పరుగుల భారీ లక్ష్యాన్ని బరోడా ఎలా ఛేదిస్తుందో చూడాలి.

ఈ మ్యాచ్‌తో గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేసిన స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో తేలిపోయాడు. తన నాలుగు ఓవర్ల కోటాలో ఏకంగా 52 పరుగులు ఇచ్చి కేవలం ఒక వికెట్ మాత్రమే తీసుకోగలిగాడు. పంజాబ్ బ్యాటర్లు హార్దిక్ బౌలింగ్‌ను సులభంగా ఎదుర్కొని పరుగులు రాబట్టారు.

# బంధం ఉన్నంత వరకే కొనసాగుతుంది



రాజ్‌నిడుమోరు మాజీ భార్య శ్యామాలి

**టాకీస్:** తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంపై రాజ్ మాజీ భార్య శ్యామాలి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎన్నో రోజులుగా వస్తోన్న రూమర్స్‌కు చెక్ పెడుతూ దర్శకుడు రాజ్ నిడిమోరు, నటి సమంత వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ జంటకు నెటిజన్లు, సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలుపుతోన్న వేళ.. రాజ్ మాజీ భార్య శ్యామాలి పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఎప్పుడూ తన ఆలోచనలను సోషల్ మీడియా వేదికగా పంచుకునే ఆమె తాజాగా ఒక పోస్ట్‌ను షేర్ చేశారు. 'ఈ అనంత విశ్వంలో మనం ఒక మూల ఉన్నాం' అని అర్థం వచ్చేలా ఒక ఇమేజ్ షేర్ చేశారు. రాజ్ – సమంతల వివాహం జరిగిన రోజు సోమవారం కూడా శ్యామాలి పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారని ఆమె రాసుకొచ్చారు. అలాగే, మనతో రుణం ఉన్నంత వరకే బంధాలు అన్నీ ఉంటాయి. రుణం తీరిన తర్వాత బంధం శాశ్వతంగా దూరమవుతుందని శ్యామాలి ఐదు రోజుల క్రితం తన ఇన్‌స్టాలో పోస్ట్ పెట్టారు.



MOVIE TIME

## హిందీలో అడుగు పెట్టాలంటే ఆర్భాటం తప్పనిసరి

### మళయాల నటుడు దుల్కర్ సల్మాన్

**టాకీస్:** హిందీ, మలయాళ చిత్ర పరిశ్రమల మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని నటుడు దుల్కర్ సల్మాన్ అన్నారు. హిందీలో ప్రవేశించాలంటే హంగూ..ఆర్భాటంఅవసరం అన్నారు. లేదంటే మనలను కనీసం చూడకూడా చూడరని వ్యాఖ్యానించారు. భాషతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో అలరిస్తున్న దుల్కర్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. హిందీ సినిమాలో నటించేటప్పుడు పెద్ద స్టార్ అని అనిపించుకోకపోతే వాళ్లు ఎంతో నిర్లక్ష్యం చేస్తారని అన్నారు. తాను బాలీవుడ్‌లో నటించేటప్పుడు నా చుట్టూ ఎప్పుడూ ఇద్దరు వ్యక్తులు ఉండేవారు. నేను స్టార్ అని అందరినీ నమ్మించాల్సి వచ్చింది. లేకపోతే నాకు కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా ఉ ఒడదు. మోనిటర్ చూడడానికి స్థలం కూడా ఇవ్వరు. మన చుట్టూ జనాలు ఉంటేనే వాళ్లు మనల్ని గుర్తిస్తారు. లగ్జరీ కారులో వస్తేనే మనల్ని స్టార్ అనుకుంటారు. అలాంటి భావన దురదృష్టకరం. మలయాళ సినిమా సెట్‌లో పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఎక్కువ ఖర్చు ఉండదు. లగ్జరీకి ప్రాధాన్యం ఇవ్వరు. రాష్ట్రంలో ఎన్నో ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. ఇంటినుంచి అన్నీ తెచ్చుకుంటాం. ఎక్కువగా సొంత ఖర్చులే పెట్టుకుంటాం అని దుల్కర్ అన్నారు. 2018లో దుల్కర్ కార్వాన్ చిత్రంతో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఇటీవలే 'కాంత'తో ప్రేక్షకులను పలకరించారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిసెంబర్ 12 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రసారం కానున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## యానిమల్ ఛాన్స్ వచ్చివుంటే తిరస్కరించే దాన్ని..

### రసిక దుగల్

టాకీస్: బాలీవుడ్ నటి రసిక దుగల్ మరోసారి తన సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచింది. పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే సినిమాలను తాను ఎప్పటికీ అంగీకరించబోనని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా బాలీవుడ్‌లో భారీ విజయం సాధించిన 'యానిమల్' వంటి సినిమా ఆఫర్ తనకు వస్తే తాను 'నో' చెప్పేదానినని తెలిపింది. 'మీర్జాపూర్', 'ఢిల్లీ క్రైమ్' వంటి పాపులర్ వెబ్ సిరీస్‌లతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రసిక దుగల్.. సినిమాలను ఎంచుకునే విషయంలో



తన విధానాన్ని తాజాగా ఒక ఇంటర్వ్యూలో పంచుకుంది. నేను ఎంచుకునే ప్రతి సినిమా యొక్క రాజకీయాలు నాకు చాలా ముఖ్యం. కేవలం పైపైన చూడడం కాకుండా, అది నా నిర్ణయాలకు మూలస్తంభంగా నిలుస్తుంది. ఒకవేళ నాకు 'యానిమల్' వంటి సినిమాలో అవకాశం వచ్చి ఉంటే దానికి నేను ఖచ్చితంగా 'నో' చెప్పేదాన్ని. ఎందుకంటే పితృస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రాజెక్ట్‌ను నేను ఒకరోజు అంగీకరిస్తానేమోననేదే నా అతిపెద్ద భయం అని రసిక దుగల్ అన్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.




## హిట్ కొట్టిన రుక్మిణి వసంత్..

### ఊపిరిపీల్చుకున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్

టాకీస్: ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ సినిమాలో హీరోయిన్‌గా 'రుక్మిణి వసంత్‌ను తీసుకున్నారు. అయితే ఈ విషయం బైటకొచ్చాక రుక్మిణి నటించిన మదరాసి ఫ్లాప్ అయింది. అసలు ఈ అమ్మడికి ఈమధ్య కాలంలో హిట్టే లేదు. దీంతో ఈ అమ్మడిపై ఐరెన్ లెగ్ ముద్రపడింది. కోరి కోరి రుక్మిణిని హీరోయిన్‌గా తీసుకున్నారన్న భయం తారక్ ఫ్యాన్స్‌లో వుండిపోయింది. అయితే ఈ భయాన్ని కాంతార చాప్టర్ 1 హిట్ పోగొట్టింది. 2019లో వెండితెరపైకి అడుగుపెట్టిన రుక్మిణి, రక్షిత్‌శెట్టితో నటించిన 'సప్త సముద్రాలు దాటి' క్రేజ్ తీసుకొచ్చింది. తమిళంలో ఏక్ మూవీలో విజయ్ సేతుపతితో జత కట్టింది. 'మదరాసి'లో శివ కార్తికేయన్‌తో నటించింది. అయితే ఈ రెండు సినిమాలు ఫ్లాప్ అయ్యాయి. దీనికి ముందే తారక్‌తో నటించే అదృష్టం కొట్టేసింది. తనపై పడిన ఫ్లాప్ హీరోయిన్ ముద్రను రుక్మిణి వసంత్ కాంతార చాప్టర్1 చెరిపేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 800 కోట్లకు పైగా కలెక్ట్ చేసింది. కాంతార చాప్టర్1 సక్సెస్‌తో తారక్ ఫ్యాన్సే కాదు..యశ్ అభిమానులు కూడా ఊపిరి పీల్చుకున్నాడు. యశ్ టాక్సిక్‌లో ఎంతోమంది హీరోయిన్స్‌ను అనుకుని చివరికి రుక్మిణిని సెలెక్ట్ చేశారు. ప్రస్తుతం ఈ అమ్మడు నటిస్తున్నవన్నీ పాన్ ఇండియా మూవీసే కావడం విశేషం. కన్నడ డైరెక్టర్ ప్రశాంత్ నీల్‌కు తెలుగు స్టార్స్ కావాలేగానీ.. హీరోయిన్స్‌గా కన్నడ భామలనే తీసుకుంటాడు. ఆల్రెడీ క్రేజీ ఇమేజ్ వున్న రుక్మిణి వసంత్‌ను తీసుకున్నాడు దర్శకుడు. ట్రెడిషనల్‌గా.. మోడ్రన్‌గా ఎలా కావాలంటే అలా కనిపిస్తుంది రుక్మిణి. అయితే.. ప్రశాంత్ సినిమాల్లో గ్లామర్‌కు చోటు వుండదు. మరి ఎన్టీఆర్ పక్కన ఈ కన్నడ అమ్మాయిని ఎలా చూపిస్తాడో మరి.

## సెలబ్రిటీలు మరణిస్తే ఇంత దిగజారుడా

### ఇదేం జర్నలిజం అంటూ వాపోయిన జాన్వీ

టాకీస్: సెలబ్రిటీలు మరణించినప్పుడు మీడియా వ్యవహరిస్తోన్న తీరుపై నటి జాన్వీకపూర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. తన తల్లి శ్రీదేవి మరణించినప్పుడు అందరూ తనను టార్గెట్ చేశారని బాధ పడ్డారు. కొందరు తన మాటలను మీమ్స్‌గా కూడా



ఉపయోగించుకున్నారని అవి చూసినప్పుడు కలిగిన బాధ మాటల్లో వర్ణించలేనని అన్నారు. తాజాగా లెజెండరీ నటుడు ధర్మేంద్ర మృతి చెందినప్పుడు కూడా మీడియా అత్యుత్సాహం చూపించిందని అది నిజమైన జర్నలిజం కాదని జాన్వీ అసహనం వ్యక్తంచేశారు.తన తల్లి మరణించినప్పుడు టీవీ చూడడానికి కూడా భయం వేసిందని జాన్వీ అన్నారు. అమ్మ మరణంపై ఎన్నో అవాస్తవాలు రాశారు. ఒక కూతురుగా ఎంతో గందరగోళానికి గురయ్యాను. ఎప్పటికీ కోలుకోలేనేనని భయపడ్డా. ఆ తర్వాత అన్నీ అర్థం చేసుకొని నా పనిపై దృష్టిపెట్టాను అని జాన్వీ చెప్పారు. తాను ఇండస్ట్రీలోకి రావడానికి కొన్ని నెలల ముందే మా అమ్మ ఈ లోకాన్ని విడిచిపెట్టింది. నా తొలి చిత్రం ప్రచారంలో నేను మా అమ్మను గుర్తుచేసుకుంటూ చెప్పిన మాటలపై కొందరు మీమ్స్ చేశారు. నన్ను టార్గెట్ చేసి మాట్లాడేవారు. అవి చూసి కొన్ని రోజులు అన్నిటికీ దూరంగా ఉ న్నాను. ఆ కాలాన్ని నేను ఇప్పటికీ మర్చిపోలేను. ఆ సమయంలో నేను ఏది చెప్పినా అది అందరికీ తప్పగానే అనిపించేది.

## రోషన్ కనకాల 'మౌగ్లీ' ట్రైలర్ విడుదల




**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాంకర్ సుమ కనకాల తనయుడు, యువ నటుడు రోషన్ కనకాల హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మౌగ్లీ 2025'. ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ విన్నర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సినిమాలో రోషన్ సరసన సాక్షి సాగర్ మదోల్కర్ నటిస్తున్నారు. వైవా హర్ష ముఖ్య పాత్రలో కనిపించనున్నాడు. కాలా భైరవ సంగీతం అందిస్తున్నాడు.

## అడల్ట్ కామెడీతో సైక్ సిద్దార్థ

టాకీస్: టాలీవుడ్ యువ నటుడు నందు, యామిని భాస్కర్ జంటగా నటిస్తున్న సినిమా 'సైక్ సిద్దార్థ'. మిలాంటి యువకుడి కథ అనేది ఉపశీర్షిక. అడల్ట్ కామెడీతో తెరకెక్కుతున్న ఈ మూవీకి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహిస్తుండగా ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రి, మౌనిక తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. నిర్మాత శ్యామ్ సుందర్ రెడ్డితో పాటు నందు కూడా ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రం డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ చూస్తుంటే అడల్ట్ కామెడీగా ఈ చిత్రం రాబోతుందని తెలుస్తుంది. ఎక్కువగా బూతులతోనే ట్రైలర్‌ను నింపేశారు.




## అభిమానులకు విజువల్ ఫీస్ట్‌లా చిరంజీవి, వెంకటేశ్ సాంగ్..



**టాకీస్:** టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్ పోషిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు. అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో వెంకటేశ్ గెస్ట్ రోల్‌లో నటిస్తున్నాడని తెలిసిందే. చిరంజీవి, వెంకటేశ్ కాంబోలో ఓ పాట కూడా ఉండగా షూటింగ్ కొనసాగుతుందంటూ వార్తలు కూడా వచ్చాయి. తాజాగా దీనిపై అధికారిక అప్‌డేట్ వచ్చేసింది. ఈ సాంగ్ గ్లింప్స్ షేర్ చేశారు మేకర్స్. బ్యాక్ డ్రాప్ విజువల్స్ ఫైరింగ్ మోడ్‌లో ఉండగా.. చిరు, వెంకీ కలిసి నడుస్తూ థంబ్స్ అప్ సింబల్ చూపిస్తున్న గ్లింప్స్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. మెగా విక్టరీ మాస్ సాంగ్.. షూటింగ్ కొనసాగుతోంది అంటూ అనిల్ రావిపూడి టీం షేర్ చేసిన అదిరిపోయే సాంగ్ గ్లింప్స్ ఇంట్రో నెట్టింట వైరల్ అవుతూ పాటపై అంచనాలు మరింత పెంచేస్తుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.